# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 139 ఆదివారం 16 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## సింగపూర్ మంత్రి అరెస్ట్... విడుదల

**న్యూఢిల్లీ, జులై 15:**

భారత సంతతికి చెందిన సింగపూర్ మంత్రి ఎస్ ఈశ్వరన్ అరెస్ట్ అయ్యారు. ఇప్పటికే ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన తీసుకున్న నిర్ణయాల వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లినట్టు అక్కడి మీడియా వెల్లడించింది. అయితే..ఆయనను అరెస్ట్ చేసిన వెంటనే బెయిల్‌పై విడుదలయ్యారు. జులై 11న ఆయనను అరెస్ట్ చేసినట్టు స్థానిక మీడియా తెలిపింది. కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇదే కేసులో మరో బిగ్‌షాట్‌నీ అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆ తరవాత బెయిల్‌పై విడుదల చేశారు. ఈ విచారణలో ఏం తేలింది..? అసలు అధికారులు వాళ్లను ఏం ప్రశ్నించారు..? అన్న విషయాలు మాత్రం గోప్యంగానే ఉంచారు. ప్రపంచంలో అత్యంత తక్కువ అవినీతి

02

## ఫ్రాన్స్ పారిశ్రామిక వేత్తలతో ప్రధాని

**పారిస్, జులై 15:**

ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటన బిజీబిజీగా కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ.. పలువురు ప్రముఖులతో భేటీ అవుతున్నారు. బాస్టిల్ డే పరేడ్ అనంతరం.. ప్రధాని మోడీ.. పలువురు ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ పారిస్‌లో చానెల్ గ్లోబల్ సీఈవో లీనా నాయర్, ఏరోస్పేస్ ఇంజనీర్ అండ్ పైలట్ థామస్ పెస్క్వెట్, యోగా ప్రాక్టీషనర్ షార్లెట్ చోపిన్‌లతో భేటీ అయ్యారు. ఈ మేరకు ప్రధాని మోడీ ట్వీట్ చేసి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఛానెల్ గ్లోబల్ అఖాని శ్రీమతి లీనా నాయర్ తో భేటీ అయ్యారు. ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేసిన భారతీయ సంతతికి చెందిన వ్యక్తిని కలవడం ఎల్లప్పుడూ సంతోషాన్నిస్తుంది. హస్తకళాకారులలో నైపుణ్యాభివృద్ధిని మరింత పెంచడానికి, ఖాదీని మరింత ప్రాచుర్యం పొందేందుకు చర్చించినట్లు తెలిపారు.అయితే, ప్రధానమంత్రిని కలిసిన తర్వాత ఈనా నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీని కలవడం చాలా ఆసక్తిగా ఉంది. వ్యాపారంలో ఇతర మహిళలు, బాలికలకు మద్దతు ఇవ్వడానికి.. ఆయన అభిరుచి, నిబద్ధతను చూడవచ్చు. భారతదేశం ప్రతి ఒక్కరికీ పెట్టుబడి కేంద్రంగా ఉండేలా ప్రధానమంత్రికి నిజంగా ఆసక్తి ఉంది. ప్రధాని మోదీతో భారతదేశ అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. ముఖ్యంగా హస్తకళాకారులను ఎలా ప్రోత్సహించాలి.. ఖాదీని గ్లోబల్ బ్రాండ్‌గా ఎలా తీర్చిదిద్దుతారనే దానిపై

02



## ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్ లింక్

**అమరావతి, జులై 15**

ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు, రాయితీలు, సేవలు పొందాలంటే లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలను తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై తాజాగా ఆర్డినెన్స్ జారీ చేసింది. శుక్రవారం నుంచే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని తెలిపింది. ప్రజల వ్యక్తిగత సమాచారంతో కూడిన ఆధార్‌కు గోప్యత అవసరమని, దానిని నిర్బంధం చేయకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే రూలింగ్ ఇచ్చింది. అయినప్పటికీ... ఆధార్ సహా




ప్రజలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం సేకరిస్తూనే ఉంది. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనాలు, రాయితీలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బట్వాడా చేయడంలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం

02

## ప్రకృతిని కాపాడుకుందాం

**పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..**

**- ఐక్యరాజ్యసమితి వేదికగా..**

**ప్రపంచదేశాలకు భారత పర్యాటక మంత్రి కిషన్ రెడ్డి పిలుపు**

**న్యూయార్క్ జులై 15**

ప్రకృతిని కాపాడుకుంటూ.. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ పరస్పర సమన్వయంతో.. ముందుకెళ్లినపుడే

02



## దళితులకు భూమి హక్కు

**విజయవాడ, జులై 15,:**



ప్రభుత్వం ఎవ్వరూ ఊహించని డెసిషన్ తీసుకుంది. తొమ్మిది నెలల్లో ఎన్నికలకు వెలుతున్న తరుణంలో తన బలాన్ని మరింత పుంజుకునేందుకు ఒక్కో అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. ఇప్పుడు రాజకీయంగా తిరుగులేని మైలేజీ ఇచ్చే మరో సంచలన నిర్ణయం జగన్ తీసుకున్నారు. దశాబ్దాల నుంచి దళితులకు దక్కని హక్కుని ఇప్పుడు సీఎం జగన్ కలిగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని నిరుపేదలకు భూపంపిణీకి అవసరమైన కీలక నిర్ణయాలను కేబినెట్‌లో తీసుకుంది వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరగడమే తప్పా అప్పటి నుండి ఇప్పటి వరకు భూ పంపిణీ ఎవ్వరూ చేయలేదు. ఇప్పుడు సీఎం జగన్ మళ్లీ ఆ భూ పంపిణీ చేయనున్నారు. అనేక దశాబ్దాలు ఆ భూములను సాగుచేస్తున్నా, ఆ భూము లను నమ్ముకుని బ్రతుకుతున్నా, ఆ భూములపై మాకు హక్కు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా 54,129.45 ఎకరాలను పేద రైతులకు అసైన్ చేయాలని నిర్ణయిం చింది. రాష్ట్ర వ్యాప్తంగా

02

## గంజాయి రవాణాపై లోకేష్ గవర్నర్ కు ఫిర్యాదు

**విజయవాడ, జులై 15:**

ఏపీలో వ్యవస్థీకృతంగా సాగుతున్న గంజాయి సాగు, రవాణా గురించి గవర్నర్‌కు నారా లోకేష్ ఫిర్యాదు చేశారు. సుమారు అరగంట సేపు గవర్నర్ అబ్దుల్ నజీర్ తో లోకేష్ సమావేశం అయ్యారు. దేశంలో ఎక్కడా గంజాయి దొరికినా మెడిన్ ఏపీ అనే అంటున్నారని.. పాదయాత్రలో గంజాయి వినియోగం వల్ల నాశనమైన కుటుంబాల వ్యధలు తన దృష్టికి వచ్చాయని గవర్నర్ తెలిపారు. ఏపీలో ఎక్కడ ఏ ఘటన జరిగినా దానికి కారణం గంజాయి మత్తేనన్నారు. సీఎం జగన్ నివాసానికి సమీపంలో జరిగిన ఘటనలకు గంజాయి మత్తే కారణమని గుర్తుచేశారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు గంజాయి మత్తులోనే తన డ్రైవర్ సుబ్రమణ్యాన్ని చంపేశాడని.. ఉడ్తా పంజాబ్ సినిమా తరహాలో ఇప్పుడు ఉడ్తా ఏపీ అంటున్నారని విమర్శించారుఇన్ని ఘటనలకు గంజాయి కారణంగా ఉంటే..



సీఎం జగన్ డీజీపీని పిలిచి కనీసం వివరాలు కూడా అడగలేదన్నారు. ఆర్జీవీ తీసే సినిమాపై రివ్యూ చేయడానికి జగనుకు సమయం ఉంది కానీ.. గంజాయి నివారణకు చర్యలు తీసుకోవడానికి లేదా..? అని లోకేష్ ప్రశ్నించారు. జగన్, వైసీపీ నేతల సహకారంతోనే గంజాయి వినియోగం పెరుగుతోందన్నారు. పోలీస్ వ్యవస్థ అంత కఠినంగా ఉంటే గంజాయి కారణంగా ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని.. ప్రశ్నించారు. ఏపీలో క్రైమ్ రేట్ పెరగడానికి గంజాయే కారణమని.. సీఎం ఇంటి

02



## హిందూ ధర్మాన్ని దూషిస్తే చూస్తూ కూర్చోం

**విజయవాడ, జులై 15:**

జగన్ ప్రభుత్వంలో హిందూ ధర్మానికి రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు పవన్ కళ్యాణ్. భారతదేశంలో అంబేద్కర్ కల్పించిన హక్కులను జగన్ ప్రభుత్వం కాలరాతోందని దూషించారు. హిందూ దేవాలయాలపై మాన్యాలపై దాడులు కబ్జాలు జరుగుతుంటే జగన్ ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు. హిందూ ధర్మం మీద దాడి చేసినట్టు ఇస్లాం మతం మీద గాని క్రైస్తవ మతం మీద గాని మీరు దాడి

02

# ఫ్రాన్స్ పారిశ్రామిక వేత్తలతో ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

చర్చ జరిగిందని తెలిపారు. సైన్స్, అంతరిక్షం వైపు యువకులను ప్రేరేపించే విషయానికి వస్తే, థామస్ పెస్క్వెట్ పేరు ప్రముఖంగా కనిపిస్తుంది. ఆయనను కలవడం, అనేక విషయాలపై అభిప్రాయాలు పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. అతని శక్తి, అంతర్దృష్టి చాలా విలువైనవి.. అంటూ ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోడీతో భేటీ అనంతరం ఏరోస్పేస్ ఇంజనీర్ ? పైలట్ థామస్ పెస్క్వెట్ కీలక వ్యాఖ్యలు చేశారు.. వ్యక్తులను అంతరిక్షంలోకి పంపడం చాలా కష్టం. భారతదేశం అపురూపమైన వేగంతో చేస్తోంది. చంద్రయాన్ 3ని ప్రయోగించినందుకు భారతదేశానికి అభినందనలు.. ప్రధాని మోడీ దాని గురించి సరైన మార్గంలో ఆలోచిస్తున్నారని నేను భావిస్తున్నాను. స్పేస్ కోసం చాలా పనులు చేస్తుంది, కానీ కొన్ని చాలా స్వల్పకాలికమైనవి. రోజువారీ నావిగేషన్ సిస్టమ్, విపత్తు ఉపశమనం, పబ్లిక్ పాలసీ, పట్టణ ప్రణాళిక లేదా మౌలిక సదుపాయాల కోసం స్పేస్ నుంచి చిత్రాలను ఉపయోగించడం. అలాంటి వాటిపై దృష్టి పెట్టారు. ఇలాంటి విషయాల్లో భారతదేశం సరైన మార్గంలో ఉందని నేను భావిస్తున్నాను" అని పెస్క్వెట్ అన్నారు. షార్లెట్ చోపిన్ తో భేటీ అనంతరం పీఎం ట్వీట్ చేశారు. పారిస్‌లో చెప్పుకోదగిన షార్లెట్ చోపిన్‌ని కలిసే అవకాశం నాకు లభించింది. ఆమె 50 సంవత్సరాల వయస్సులో యోగాను అభ్యసించడం ప్రారంభించారు. ఆమె త్వరలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతోన్నారు. కానీ యోగా.. ఫిట్‌నెస్ పట్ల ఆమెకున్న మక్కువ కొన్ని సంవత్సరాలుగా పెరిగింది.. అని ట్వీట్ చేశారు

## ఫ్రాన్స్ అధ్యక్షుడి భార్యకు పోచంపల్లి చీర బహుమతి

భారత ప్రధాని నరేంద్రమోడీ ఫ్రాన్స్ పర్యటనలో ఉన్నారు. అక్కడి అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ భార్య బ్రిగిట్టే మాక్రాన్‌కు ఈ పోచంపల్లి ఇకత్ చీరను బహుమతిగా ఇచ్చారు. ఈ చీరను మోడీ శాండల్‌వుడ్ బాక్స్‌లో అందించారు. మరి ప్రధాని అందించిన ఇకత్‌పై మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఇకత్ చీర ఎంతో ప్రసిద్ధి చెందింది. తెలంగాణలో కొన్ని ప్రాంతాలు చీరలకు ప్రత్యేకతలుగా నిలుస్తున్నాయి. నల్గొండ జిల్లాలోని భూదాన్ పోచంపల్లి చీరల విషయంలో పేరొందుతోంది. మహిళలను ఆకట్టుకునే విధంగా చీరలు ఇక్కడే తయారవుతాయి. ఇక్కడి చీరలకు రంగులువేసే విధానం కొనసాగుతోంది. ఈ విధానాన్నే రెసిస్ట్ డైయింగ్ అని అంటుంటారు. ఇక్కడ చీరలకు ఉపయోగించే దారాలకే రంగులు అద్ది డిజైన్‌లను వేస్తుంటారు. అయితే ఈ రెసిస్ట్ డైయింగ్ అనేది వరల్డ్ వైజ్‌గా పురాతన విధానాల్లో ఒకటిగా చెప్పుకొంటారు. ఈ చీరలకు తయారు చేసే విధానాల్లో ఫాబ్రిక్ నమూనాల్లో ఒకటి ఈజిప్ట్‌కు చెందినదిగా చెబుతున్నారు. మమ్మీలను వెలికితీసే క్రమంలో నార పట్టీలను గుర్తించారు. ఆసియాలో, చైనా ఈ విధానం ప్రాచుర్యంలోకి తీసుకువచ్చింది. దీనిని రాజవంశంలో అధికంగా వినియోగించారని చెబుతుంటారు. ఈ పట్టు మార్గం ద్వారా ఈ విధానాన్ని భారత్‌కు పరిచయం చేశారు. అయితే ఈ పోచంపల్లి చీరలు 1800 కాలంలో ప్రాచూర్యం పొందాయని చరిత్రకారులు చెబుతున్నారు. అయితే ఇకత్ చీర అనేగానే ముందుగా గుర్తుకు వచ్చేది పోచంపల్లి. అయితే మామూలుగా బట్టను నేసిన తర్వాత రంగులను అద్ది డిజైన్‌ను రూపొందిస్తారు వస్త్రాకారులు. టై అండ్ డై టెక్నిక్ ద్వారా దారాలకే రంగులను అద్ది వాటితోనే డిజైన్‌ను రూపొందించి నేయడమే ఇకత్ చీర శైలి. ఈ పోచంపల్లి చీరలను తయారు చేసే హస్తకళాకారులు ఏపీలోని దాదాపు 80కిపైగా గ్రామాల వారు పోచంపల్లిలోని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ చీరల తయారీ శతాబ్దాల కిందటి నుంచే కొనసాగుతోంది. ఈ చీరల తయారీలో పాల్గొనే కుటుంబాలతో ఈ ఏరియాను సిల్క్ సిటీగా పిలుస్తారు. ఈ చీరలను ప్రత్యేకంగా డిజైన్ చేస్తారు. ఈ బట్టల తయారీలో దారాలకు ముందుగా రంగులు అద్ది తర్వాత తయారు చేసేందుకు మగ్గాన్ని వినియోగిస్తారు. ఈ బట్టల తయారీలో బాటిక్ అనేది ఒక సంప్రదాయ పద్దతి. ఈ చీరలపై చుక్కలు, రేఖలు వేసి కాపర్ స్టాంప్ సాయంతో ప్రింటింగ్ వేస్తారు. ఇక్కడ చీరలను తయారు చేయడమే కాకుండా సల్వార్లు, షూట్స్, అనార్కలీ, లెహంగాలు వంటి వివిధ రకాల భారతీయ సంప్రాదాయ వస్త్రాలను సైతం తయారు చేస్తారు. ఇక 2005 సంవత్సరంలో పోచంపల్లి జియో గ్రాఫికల్ ఇండికేటర్ సైతం లభించింది. ఇది చీరల నాణ్యతను సూచిస్తుంది. ఇకపోతే ఈ పోచంపల్లి సారీలను ఐశ్వర్యరాయ్ సైతం తన వివాహం రోజున ధరించారు కూడా. ఎంతో మంది సెలబ్రిటీలు కూడా ఈ పోచంపల్లి చీరలను ధరించిన సందర్భాలు చాలా ఉన్నాయని చెప్పాలి. అంతేకాకుండా ఎయిరిండియా హోస్టెస్ కూడా ఈ పోచంపల్లి చీరలను ధరించారు.

## దుబాయ్ కు చేరుకున్న ప్రధాని మోడీ

ప్రధాని నరేంద్ర మోదీ ఫ్రాన్స్ పర్యటన ముగించుకుని అటు నుంచి దుబాయ్‌కి వెళ్లారు. అబుదాబి ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన ప్రధాని మోదీకి అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా మోదీ, మహమ్మద్ బిన్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆహార భద్రత, రక్షణ రంగంలో ఇరు దేశాలు పరస్పరం సహకరించుకునే విధంగా ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. వాణిజ్యం విషయంలోనూ కీలక ఒప్పందాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రధాని యూఏఈ పర్యటనపై విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు చేసింది. యూఏఈ, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుందని, ప్రధాని మోదీ పర్యటనతో అది ఇంకాస్త ముందుకెళు ్తందని వెల్లడించింది. "భారత్, యూఏఈ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏళ్లుగా కొనసాగుతోంది. ప్రధాని మోదీ పర్యటనతో ఆ బంధం మరింత బలపడుతుంది. ముఖ్యంగా విద్య, హెల్త్‌కేర్, ఆహార భద్రత, రక్షణ రంగాలపై ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోనున్నాయి."మోదీ పర్యటన సందర్భంగా దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫాపై మోదీ ఫొటోతో పాటు భారత త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. ఇదే పర్యటనలో ప్రధాని మోదీ అంతర్జాతీయ అంశాల గురించీ చర్చించనున్నారు. కాప్ -28 సదస్సుకి యూఏఈ అధ్యక్షత వహించనుంది. అటు ఉ20 సమ్మిట్‌ని భారత్ లీడ్ చేయనుంది. అందుకే...ఈ రెండు సదస్సులపైనా కీలక చర్చలు జరపనున్నారు మోదీ. ఫ్రాన్స్‌లో రెండ్రోజుల పాటు పర్యటించారు. ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. ఫ్రాన్స్‌లో ఙఖఎ చెల్లింపులు చేసేలా కొత్త చట్టం తీసుకురానున్నారు. దీంతో పాటు మిలిటరీ విషయంలోనూ ఇరు దేశాలు పరస్పరం సహకరించుకునేలా ఒప్పందాలు కుదిరాయి. ఫ్రాన్స్, భారత్ మధ్య ద్వైపాక్షిక బంధాలు మొదలై పాతికేళ్లు పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటించారు. ఫ్రాన్స్ మోదీని ఘనంగా స్వాగతించడమే కాకుండా అత్యున్నత అవార్డుతో సత్కరించింది.

# ప్రకృతిని కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి చేరుకోవచ్చని.. భారత పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకోసం ప్రపంచదేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పనిచేద్దామని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో ఆర్థిక ప్రగతి, సామాజిక, పర్యావరణ సుస్థిరత అంశంపై న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి హైలెవల్ పొలిటికల్ ఫోరం వేదికగా జరిగిన సదస్సులో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో భారతదేశం తరపున పాల్గొనడం గర్వంగా ఉందన్న కిషన్ రెడ్డి.. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో గత దశాబ్ద కాలంగా ఆర్థిక, సామాజిక, పర్యావరణ స్థిరత్వమే ప్రధాన ఎజెండాగా చేపట్టిన పాలసీలు, ప్రాధాన్యతలతో భారతదేశం సాధిస్తున్న ప్రగతిని వివరించారు. గత పదేళ్లుగా పర్యావరణ సుస్థిరత కోసం మోదీ సర్కారు చేస్తున్న కృషి కారణంగా.. నేడు టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలకు ఎజెండా నిర్దేశించడంతోపాటు ముందుండి విజయవంతంగా నడిపామని కేంద్ర పర్యాటక మంత్రి వివరించారు. జీ-20 ప్రెసిడెన్సీ ద్వారా పర్యాటక వర్కింగ్ గ్రూపు సమావేశాల నిర్వహణతోపాటుగా గోవాలో గత నెలలో జరిగిన జీ20 సభ్యదేశాలు, ఆతిథ్య దేశాల పర్యాటక మంత్రుల సమావేశంలో ఏకగ్రీవంగా 'గోవా రోడ్ మ్యాప్'కు ఆమోదం తెలిపిన విషయాన్నీ కిషన్ రెడ్డి ప్రస్తావించారు. ఈ గోవా రోడ్ మ్యాప్‌లో.. గ్రీన్ టూరిజం (సుస్థిర, బాధ్యతాయుతమైన, హరిత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా సరైన ఫలితాలను సాధించడం), డిజిటలైజేషన్ (పర్యాటక రంగంలో సుస్థిరత, సమగ్రతను సాధించేందుకు డిజిటలైజేషన్ ద్వారా ఓ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకోవడం), స్కిల్స్ (యువత నైపుణ్యాలకు పదునుపెడుతూ పర్యాటక రంగంలో ఉపాధి, వ్యాపారసామర్థ్యాన్ని పెంచేలా చర్యలు), టూరిజం ఓఓఇఖ (పర్యాటక రంగంలోని ఓఓఇ లకు, స్టార్టప్‌లకు, ప్రైవేటు రంగానికి సరైన ప్రోత్సాహాన్ని అందిస్తూ.. సృజనాత్మకతకు పెద్దపీట వేయడం), డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ (గమ్యస్థానాల్లో అవసరమైన నిర్వహణ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించడంపై పునరాలోచన తద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సమగ్రమైన విధానంతో ముందుకెళ్లడం) అనే ఐదు కీలకమైన అంశాలపై ఏకగ్రీవంగా ఆమోదించిన విషయాన్ని కేంద్రమంత్రి గుర్తుచేశారు. గోవా రోడ్ మ్యాప్ ద్వారా.. ప్రత్యక్షంగా, సానుకూలంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా అడుగులు పడ్డాయన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి ఆలోచనల మేరకు.. ఘనమైన భారతదేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వం కేంద్రంగా పర్యాటకాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి మౌలికవసతుల కల్పనతో ముందుకెళ్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు, వారసత్వాన్ని కాపాడుకునేందుకు.. వివిధ దేశాలతో కలిపి థీమ్ బేస్డ్.. బుద్దిస్ట్ సర్క్యూట్, రామాయణ సర్క్యూట్, హిమాలయన్ సర్క్యూట్, హెరిటేజ్ సర్క్యూట్ మొదలైన వాటిని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భారత ప్రభుత్వం రూపొందించిన నూతన జాతీయ పర్యాటక విధానం ముసాయిదాలో ఇలాంటి వాటికి సరైన ప్రాధాన్యత కల్పించామన్నారు. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత భారత్‌తోపాటు ప్రపంచ పర్యాటకానికి కూడా ఎంతో సానుకూల ఫలితాలను అందిస్తుందన్నారు. ప్రకృతితో అనుసంధానమైన జీవన విధానం వంటివి భారతదేశంలో పర్యాటకాభివృద్ధికి సానుకూలమైన అంశాలన్నారు. భారతదేశ సంప్రదాయ వైద్యమైన ఆయుర్వేద, యోగ, నేచురోపతి వంటివన్నీ.. ప్రకృతితో మమేకమైన జీవించాలన్న ఆలోచనను ప్రతిబింబిస్తాయని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. 'ప్రపంచమంతా ఒకే కుటుంబం' అనే భారతీయ జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకుని.. రానున్న రోజుల్లో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ దిశగా మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవలే.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా జీవనవిధానాన్ని మార్చుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే ఉద్దేశంతో.. మిషన్ లైఫ్ (ఒతిఈఇ ? లైఫ్‌స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) ను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసిన భారత పర్యాటక మంత్రి.. ప్రజలతోపాటు పర్యాటకులు కూడా చిన్న ఆలోచనలు, చిన్న మార్పుల ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావొచ్చన్నారు. పర్యావరణ స్పృహతోపాటు పర్యాటకానికి సరైన గుర్తింపును తీసుకొచ్చే లక్ష్యంతో పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో.. 'యువ టూరిజం క్లబ్'లను ఏర్పాటుచేశామన్నారు. తర్వాతి తర్వాతమైన భారతపౌరుల్లో పర్యాటక, పర్యావరణ స్పృహను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ క్లబ్స్ ద్వారా సానుకూల ఫలితాలు కనబడుతున్నాయన్నారు. 2030 నాటికి పూర్తిచేసేలా నిర్దేశించుకున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఇప్పటివరకు సాధించిన ప్రగతిని కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. పర్యాటక రంగ సుస్థిరత, సమగ్రత లక్ష్యాల ప్రాధాన్యతతో భారత ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చూసేందుకు 'మీరంతా భారత్ కు రండి' అని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు సాబా కొరోశీ, ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి అధ్యక్షురాలు లాషెజరా స్టోయేవాతోపాటుగా.. వివిధ దేశాల పర్యాటక మంత్రులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, ప్రపంచ పర్యాటక రంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ మంత్రి అరెస్ట్... విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న దేశాల లిస్ట్‌లో టాప్‌లో ఉంటుంది సింగపూర్. అలాంటి దేశంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని తెలిస్తే దేశానికున్న పాపులారిటీ తగ్గిపోతుందేమో అన్న భయంతో అధికారులు అన్ని వివరాలు రహస్యంగానే ఉంచుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులు సంపాదించే దాని కంటే...అక్కడి కేబినెట్ మంత్రులు సంపాదించేదే ఎక్కువ. అంత ఎక్కువ జీతాలు ఇవ్వడానికి ప్రధాన కారణం...డబ్బు కోసం మంత్రులు అవినీతికి పాల్పకూడదనే. అయినా...ఎస్ ఈశ్వరన్ అవినీతి చేయడంపై సింగపూర్ ప్రభుత్వం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. ఈశ్వరన్‌కి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. మంత్రి ఎశ్ ఈశ్వరన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రధాని లీ జీన్ లూంగ్ సెలవు పెట్టి పక్కకు తప్పుకోవాలని ఈశ్వరన్‌కి ఇప్పటికే ఆదేశాలిచ్చారు. సింగపూర్ రవాణా మంత్రిగా ఉన్న ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాల కారణంగా భారీ ఆర్థిక నష్టం వాటిల్లినట్టు ఆరోపణలున్నాయి. ఈ కేసుని విచారించేందుకు. కరప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (అఖఎః) ప్రధానికి ఓ విజదజ్ఞప్తి చేసింది. మంత్రి ఈశ్వరన్‌ని విచారించేందుకు అనుమతినివ్వాలని కోరింది. దీనిపై వెంటనే స్పందించారు ప్రధాని లూంగ్. విచారణకు అనుమతినిచ్చారు. ఈ కేసులో నిందితులెవరైనా సరే కచ్చితంగా విచారణ జరిగి తీరుతుందని తేల్చి చెప్పారు. అప్పటి వరకూ ఈశ్వరన్ లాంగ్ లీవ్ తీసుకోవాలని ఆదేశించారు. ఆయన స్థానంలో మరో మంత్రిని తాత్కాలికంగా రవాణా మంత్రిగా నియమించారు. భారీ అవినీతిలో మంత్రి హస్తం ఉండటంపై అసహనం వ్యక్తం చేసిన ప్రధాని లూంగ్...నిజానిజాలు త్వరలోనే బయట పడతాయని స్పష్టం చేశారు. అఖఎః పూర్తిస్థాయిలో విచారణ జరుపుతుందని అన్నారు. 1997లో ఎస్ ఈశ్వరన్ రాజకీయ ప్రస్థానం మొదలైంది. సింగపూర్‌లో తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తరవాత 2006లో క్యాబినెట్‌లో చోటు దక్కింది. రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. సింగపూర్‌ని రీబిల్డ్ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇదే ఆయనకు పేరు ప్రతిష్ఠలు తెచ్చి పెట్టింది.

# ప్రభుత్వ పథకాలన్నింటికీ ఆధార్ లింక్

(మొదటిపేజీ తరువాయి)

ఆధార్ నంబరు ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో బిల్లు (ఆధార్ యాక్ట్-2016)ను ఆమోదించిందని... దానిని ఇప్పటికే దేశంలోని 16రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు... కేంద్రం ఒత్తిడి మేరకు ఏపీలో కూడా దీనిని అమలు చేస్తున్నామని పేర్కొంటున్నారు .ప్రస్తుతం శాసనసభ సమావేశాలు లేనందున గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ జారీ చేసినట్లు తెలిపారు. ఆధార్ యాక్ట్-2016, దాని సవరణలకు అనుగుణంగా ఒక నిర్దిష్ట కొత్త చట్టం చేయనున్నట్లు ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. దీన్ని ఏపీ ఆధార్ ఆర్డినెన్స్-2023గా పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్ అమలులోకి వచ్చిన 3నెలల తర్వాత ఏయే పథకాలకు ఆధార్ తప్పనిసరో వివరిస్తూ జాబితాను ప్రకటిస్తామని తెలిపింది. ఆధార్ వివరాలు ఇవ్వడంపై లబ్ధిదారులకు ఎలాంటి అభ్యంతరాలున్నా చెల్లవని... ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులపై ఎలాంటి దావాలు, ప్రాసిక్యూషన్, ఇతర చట్టపరమైన చర్యలకు తావుండదని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఆధార్ లేనివారితో కొత్తగా నమోదు చేయించి... ఆ గుర్తింపుతో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తామని అధికారులు తెలిపారు.

# గంజాయి రవాణాపై లోకేష్ గవర్నర్ కు ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

సమీపంలో పార్క్ చేసిన వాహానాలను గంజాయి మత్తులో తగులబెట్టేస్తున్నారని గుర్తు చేశారు. చిన్న పిల్లలకు గంజాయి అలవాటు చేస్తున్నారు...తర్వాత ఆ పిల్లలనే డీలర్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. 2021-22 సంవత్సరంలో 18 వేల కేజీలకు పైగా గంజాయిని పట్టుకున్నట్టు లెక్కలు చెబుతున్నాయన్నారు. రెండు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశాక.. గంజాయి ఎంత విచ్చలవిడిగా దొరుకుతుందో అర్థమైందన్నారు. ఈ విషయాలన్నీ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని మీడియాకు లోకేష్ తెలిపారు. తన పాదయాత్ర సందర్భంగా వైసీపీ నేతలు కించపరిచే విధంగా ఫ్లెక్సీలు పెడుతున్నారు..టీడీపీ నేతలపై భౌతిక దాడులకూ పాల్పడుతున్నారన్నారు. వైసీపీ నేతలు మా మీద దాడులు చేస్తున్నారు.. వాళ్ల ఫ్లెక్సీలకు సీఐ స్థాయి అధికారులతో భద్రత కల్పిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగానికి లోబడే వలంటీర్లైనా ఎవరైనా పని చేయాల్సిందేనని.. ప్రభుత్వం దగ్గర ఇప్పటికే సమాచారం ఉందని.... మళ్లీ వలంటీర్లు వ్యక్తిగత సమాచారం సేకరించాల్సిన అవసరమేముందని లోకేష్ ప్రశ్నించారు. వలంటీర్లను రాజకీయ కార్యకలాపాలకు వాడకూడదని.. స్పష్టం చేశారు. ప్రభుత్వ ఖజానా నుంచి వలంటీర్లకు వేతనం ఇస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. వలంటీర్ల వ్యవస్థ రాజ్యాంగేతర వ్యవస్థగా మారకూడదనేది మా పార్టీ విధానం... ఉన్న వ్యవస్థలతో సమన్వయం చేసుకుని వలంటీర్ తరహా వ్యవస్థ ఉండాలనేదే మా విధానమని స్పష్టం చేశారు. ముందస్తు ఎన్నికల గురించి సజ్జలనే అడగాలని లోకేష్ మీడియాకు సూచించారు. ముందస్తుకు వెళ్లాలంటే ముందుగా ఇచ్చిన హామిలను నెరవేర్చాలి కదా..? అని ప్రశ్నించారు

# హిందూ ధర్మాన్ని దూషిస్తే చూస్తూ కూర్చోం

(మొదటిపేజీ తరువాయి)

చేయగలరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వక్ఫ్ భూములకు రక్షణ ఉంది, చర్చిలకి రక్షణ ఉంది,, అయితే దేవాలయాలు మాత్రం కులదొస్తున్నారు. జలగలాంటి జగన్లు ఉన్నంతకాలం పవన్ అనేవాడు ఒకడు పుడుతూనే ఉంటాడని అన్నారు.

# దళితులకు భూమి హక్కు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తంగా 46,935 మంది లబ్ధిదారులకు భూములు ఇవ్వనుంది. కృష్ణా గోదావరి నదీ పరివాహక దళిత, పేద రైతులకు సీఎం జగన్ గుడ్ న్యూస్ చెప్పారు. లంకల్లో ఎన్నో దశాబ్దాలుగా ఆ భూములను నమ్ముకుని, సాగుచేసుకుని బ్రతికే రైతులకు ఎట్టకేలకు ఆ భూములపై హక్కు దక్కనుంది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు, ఎంత మంది ముఖ్యమంత్రుల దగ్గరకు లంక భూముల రైతులు ధరఖాస్తులు పెట్టుకున్నా ఈ సమస్యకు పరిష్కారం దక్కలేదు. కానీ సీఎం జగన్ మాత్రం భూమిలేని నిరుపేదలకు లంక భూములు ఇచ్చేయాలని నిర్ణయించారు. మూడు కేటగిరీల్లో 9,062 ఎకరాల లంక భూములు విషయంలో రైతన్నలకు అనుకూలంగా అసైన్‌మెంట్ పట్టాలు, ఐదేళ్ల లీజు ఇవ్వడానికి జగన్ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 19,176 మంది రైతులకు మేలు జరుగుతోంది. ఓవైపు అసైన్డ్ భూములు, మరో వైపు లంక భూములు రెండు కలిపితే 63,191.84 ఎకరాలు అసైన్డ్ ల్యాండ్స్ నిరుపేదలకు దక్కనుంది. ఈ భూ పంపిణీ వలన రాష్ట్రంలోని 66,111 మందికి రైతులకు హక్కులు దక్కనున్నాయి. దళిత రైతుల కోసం సీఎం జగన్ మరో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర విభజనకు ముందు ల్యాండ్ పర్చేజ్ స్కీమ్ కింద గతంలో 16,213 ఎకరాలు పొందిన దళిత ప్రజలకు ఇది సానుకూలంగా తీసుకున్న నిర్ణయం. 14,223 మందికి గతంలో భూములు, వారు కట్టాల్సిన రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు కూడా కూడా మాఫీ చేసింది. ఫలితంగా దాదాపు రూ.2000 కోట్ల విలువైన భూములపై వారికి పూర్తి హక్కులు దక్కనున్నాయి

# వైసీపీ వైపు రాయపాటి ఫ్యామిలీ చూపు

**గుంటూరు, జూలై 15:**

పీలో ఎన్నికల హడావుడి ప్రారంభం కావడంతో పార్టీల్లో గోడ దూకుళ్లు కూడా మొదలయ్యాయి. టీడీపీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రాయపాటి కుటుంబం వైసీపీలో చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఏపీలో ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అసంతృప్త నాయకులు ప్రత్యామ్నయాల వైపు దృష్టి సారిస్తున్నారు. మాజీ ఎంపీ రాయపాటి కుటుంబం నాలుగేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటోంది. 2019లో ఓటమి తర్వాత రాయపాటి సాంబశివరావు కూడా టీడీపీతో అంటిముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో సత్తెనపల్లి నియోజక వర్గంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను తెరపైకి తీసుకురావడం రుచించని రాయపాటి ఫ్యామిలీ వైసీపీ వైపు చూస్తోంది. తెలుగుదేశం పార్టీలో కన్నానుచేర్చుకోవడంపై రాయపాటి కినుక వహించారు. సత్తెనపల్లి నుంచి రాయపాటి రంగబాబు పోటీ చేయాలని భావించారు. రంగబాబు 2019లోనే సత్తెనపల్లి సీటు ఆశించిన టీడీపీ పట్టించుకోలేదు. రాయపాటి సాంబశివరావుతో నరసరావుపేట పార్లమెంటు స్థానానికి పోటీ చేయించారు. అక్కడ లావు శ్రీకృష్ణదేవరాయల చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత రాయపాటి తెలుగు దేశం పార్టీకి దూరం అయ్యారు. తాజాగా కన్నాను చేర్చుకోవడంపై అసంతృప్తి రెట్టింపైంది. పార్టీలోకి కొత్త నేతలు రాగానే సీనియర్లను పట్టించుకోలేదని అక్కసు పెరిగింది. కన్నాతో సుదీర్ఘ కాలంగా ఉన్న విబేదాలు, కోర్టువివాదాలను కొద్ది నెలల క్రితమే రాజీ ద్వారా పరిష్కరించుకున్నారు. పరువు నష్టం దావాలతో ఒరిగిదేమి ఉండదని గుర్తించడం, వయో భారం కూడా రాజీకి ఇరుపక్షాలు మొగ్గు చూపాయి. కోర్టు వివాదాలు పరిష్కారమైనా ఆధిపత్యం కోసం ప్రయత్నాలు మాత్రం ఆగలేదు. అదే సమయంలో బీజేపీ నుంచి కన్నా టీడీపీలో చేరడం, సత్తెనపల్లి బాధ్యతలు అప్పగించడం రాయపాటిని నిలువనీయకుండా చేసింది. దీంతో ప్రత్యామ్నయం వెదుక్కోవాలని భావించి వైసీపీ వైపు చూస్తున్నారు. అవసరమైతే సత్తెనపల్లిలో కన్నాపై పోటీ చేయడానికి రాయపాటి రంగబాబు సిద్ధమని అంటున్నారు. సత్తెనపల్లి ఇంచార్జిగా తమ కుటుంబాన్ని నియమించాలని రాయపాటి సాంబశివరావు పలుమార్లు కోరినా ఫలితం లేకపోవడంతో ఇప్పుడు వైసీపీలోకి వెళ్లాలనిభావిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి పోలవరం కాంట్రాక్టు నుంచి రాయపాటి కుటుంబానికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్ సంస్థను తప్పించినప్పటి నుంచి టీడీపీ అధినేతతో దూరం పెరిగింది. పోలవరం నిర్మాణ కాంట్రాక్టు దక్కించుకున్నా, పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ట్రాన్స్‌ట్రాయ్‌ను తప్పించి నవయుగను చంద్రబాబు తెరపైకి తీసుకొచ్చారు. ఇది రాయపాటి కినుక వహించడానికి కారణమైందిమరోవైపు రాయపాటిని వైసీపీలోకి తీసుకురావడానికి మాజీ మంత్రి,రాయపాటి శిష్యుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రయత్నాలు చేస్తున్నారు. గురువు రుణం తీర్చుకోడానికి ఆయన కుటుంబానికి రాజకీయం పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నాల్లో డొక్కా వైసీపీ అధిష్టానంతో సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు వైసీపీలోకి రాయపాటి రావడం వల్ల ఉపయోగం ఏముంటందనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. సత్తెనపల్లిలో ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న అంబటిని తప్పించి రాయపాటి వర్గానికి అవకాశం ఎంతవరకు లభిస్తుందనే అనుమానాలు అందరిలో ఉన్నాయి. సామాజిక సమీకరణల కోణంలో రాయపాటి కుటుంబం రాకను వైసీపీ ఆహ్వానించినా వారిని మరోచోట సర్దుబాటు చేయడమో, ఎమ్మెల్సీ వంటి పదవిని కేటాయించడమో చేసే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే సత్తెనపల్లిలో మాజీ ఎమ్మెల్సీ యర్రం వెంకటేశ్వర రెడ్డిని వైసీపీ పార్టీలో చేర్చుకుంది. రాయపాటి వంటి వారి రాక వల్ల కొత్తగా పార్టీకి ఒరిగే ప్రయోజనాలపై ఆ పార్టీ నేతల్లో సందేహాలు కూ?డా ఉన్నాయి. కమ్మ సామాజిక వర్గాన్ని ప్రభావితం చేయగలరని భావిస్తే వారిని పార్టీలోకి ఆహ్వానించవచ్చని చెబుతున్నారు.

# ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపిడీవో



**ఏలూరు**

వసతి గృహాలలో ఉంటున్న విద్యార్థులు మంచి క్రమశిక్షణ కలిగి ఉండాలని పెదవేగి ఎం పి డి ఓ గంజి రాజ్ మనోజ్ అన్నారు. బాగా చదువుకుని పాఠశాలకు, వసతి గృహానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి కూచింపూడి సాంఘీక సంక్షేమ ఎస్ సి బాలుర వసతి గృహాన్ని ఆకస్మికం గా పరిశీలించారు. కొద్దిసేపు వసతి గృహ విద్యార్థులకు ట్యూటర్ గా అవతారమెత్తారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, వారిలో దాగి ఉన్న నైపుణ్యత తెలుకునేందుకు, విద్యార్థుల ఆలోచనా విధానాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వె ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వసతి గృహాన్ని పరిశీలించినట్టు ఎం పి డి ఓ రాజ్ మనోజ్ తెలిపారు. వసతి గృహం లో విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అందిస్తున్నారా అని వసతి గృహ వార్డెన్ ని అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం రాత్రి వసతి గృహం లో ఉన్న విద్యార్థుల తో కలిసి డిన్నర్ లో పాల్గొని వంటకాలను రుచి చూసారు. భోజనానంతరం విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఉదయం బ్రేక్ పాస్ట్ లో రోజువారీ విద్యార్థులకు అందించే అల్పాహారం పై ఆరా తీశారు. వసతి గృహం లో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారు. వారందరికీ సరిపడా టాయిలెట్స్. బాత్ రూమ్ లు సక్రమం గా ఉన్నాయా అని నేరుగా పరిశీలించారు. వసతి గృహం లో విద్యార్థులు పడుకోనే రూమ్ లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే దుప్పట్లు. రగ్గులు. జంఖానాలు. బుక్స్ భద్రపరచుకోవడానికి ట్రంక్ పెట్టెలు, కాస్మోటిక్స్ వంటివి సక్రమం గా అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

# ఎన్నికల దాకా..లైవ్ లోనే ఫ్రీ కరెంట్...

**హైదరాబాద్, జూలై 15 :**

తెలంగాణలో ఉచిత విద్యుత్ మాటల మంటలు ఇప్పట్లో తగ్గేలా లేవు. ఏ క్షణంలో రేవంత్ రెడ్డి ఏం చెప్పాలనుకుని ఏ కామెంట్లు చేశారో కానీ ఆ క్షణమే భారత రాష్ట్ర సమితి నాయకులకు కొన్ని నెలలకు సరిపడా ఫీడింగ్ ఇచ్చినట్లయ్యింది. బీఆర్ఎస్ కీలక నేతలు మంత్రులు కేటీరామారావు, హరీశ్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ మొదలుకుని రాష్ట్ర, జిల్లా నాయకులంతా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ పథకానికి తిలోదకాలిస్తారంటూ వాడవాడలా ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఇపుడు ప్రభుత్వంపై ఆరోపణలు, విమర్శలు చేసే పని తప్పిపోయి.. ఉచిత విద్యుత్ పథకం కొనసాగిస్తామన్న క్లారిఫికేషన్ ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఉచిత విద్యుత్ పథకం క్రెడిట్ వందశాతం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందనడంలో సందేహమే లేదు. ఎల్బీ స్టేడియం వేదికగా రైతాంగానికి ఉచిత విద్యుత్ అమలు చేస్తూ ఏ క్షణంలో వైఎస్ఆర్ సంతకం చేశారో కానీ ఆ పథకాన్ని ఎవ్వరూ రద్దు చేయలేని .. కనీసం సవరించలేని పథకంగా మారింది. విద్యుత్ ట్రాన్స్‌కాంలకు నష్టాలను మూటగడుతున్నా పథకాన్ని కొనసాగించాల్సిన కంపల్షన్ ఇపుడు అధికారంలో ఎవరు వున్నా వారిపై పడుతోంది. నిజానికి ఉచిత విద్యుత్ సౌకర్యం అందరికీ వర్తింప చేయాల్సిన అవసరం లేదు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు వందల ఎకరాలలో పంటలు పండించే భూస్వామ్య రైతులు కూడా ఉచిత విద్యుత్ ఫలాలను పొందుతున్నారు. నిజానికి వారందరికీ వర్తింప చేయాల్సిన అవసరం లేదు. ఎందరో టాక్స్ పేయర్లు చెల్లిస్తున్న పన్నుల రూపంలో వచ్చి పడుతున్న నిధులను ఇలా ధనిక రైతులకు కూడా వర్తింపజేయడం సమంజసం కూడా కాదు. కానీ ఉచిత విద్యుత్ పథకంలో కనీసం సవరణ చేయాలన్నా కూడా ప్రభుత్వాధినేతలు జంకాల్సిన పరిస్థితి నెలకొంది. "ఉచితాలపై సమీక్ష" జరగాలని సాక్షాత్తు సుప్రీం కోర్టు చెప్పినా దానికి ఆచరణలో పెట్టేందుకు ఏ ఒక్క రాజకీయ పార్టీ సాహించలేని పరిస్థితి. ఉచిత విద్యుత్ ఒక్కటే కాదు.. రకరకాల కారణాలు, వర్గాల పేరిట కోట్లాది మందికి నగదు పంపిణీ పథకం కూడా ప్రజలను సోమరులను చేసేదే. కానీ, ఓట్ల వేటలో ప్రతీ రాజకీయ పార్టీ ఉచితాలను నమ్ముకుంటోంది. మొన్నటి కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయానికి ఉచితాల పేరిట ఓట్ల వేట మరింత ముదిరిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి ఇంకెన్ని ఉచితాలను చూడాల్సి వస్తుందోనని రకరకాల పన్నులను క్రమం తప్పకుండా కడుతున్న వేతన జీవులు, మధ్యతరగతి ఉద్యోగులు బెదిరిపోతూ చూస్తున్నారు.

ఈ అంశాన్ని పక్కన పెడితే, ఉచిత విద్యుత్ పథకం గురించి మాట్లాడిన రేవంత్ రెడ్డి.. తాజాగా 2000లో హైదరాబాద్ బషీర్‌బాగ్ కాల్పుల అంశాన్ని ప్రస్తావించారు. ఆనాటి కాల్పులకు అంతర్గత కారకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పేందుకు యత్నించారు. నిజానికి ఆనాడు కేసీఆర్ మంత్రి పదవిని కాంక్షించి భంగపడి.. దక్కిన డిప్యూటీ స్పీకర్ పదవిని ఆస్వాదించలేని తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. భవిష్యత్ రాజకీయానికి కొత్త పంథాను వెతుక్కుంటూ తెలంగాణ ఉద్యమ ప్రారంభ సన్నాహాలలో ఉన్నారు. అలాంటి అసంతృప్త నేత ఆనాడు రాజకీయ చాణక్యునిగా కొందరిచే కీర్తింపబడుతున్న నారా చంద్రబాబునాయుడుని ఏ మేరకు, ఏ మార్గంలో ప్రభావితం చేయగలడన్నది ఆలోచించాల్సిన ప్రశ్నే. 2000లో విద్యుత్ సంస్కరణలను శరవేగంగా అమలు చేస్తున్న సీఎంగా చంద్రబాబు దేశంలో అందరి దృష్టినీ ఆకర్షించారు. ఉత్తరాది రాష్ట్రాలు సంస్కరణలపై కనీసం ఆలోచన కూడా చేయని తరుణంలో చంద్రబాబు విద్యుత్ సంస్కరణలను అమలు చేస్తూ ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు (ఏపీఎస్ఈబీ)ని మూడు ముక్కలు చేసి.. విద్యుత్ జనరేషన్, విద్యుత్ ట్రాన్స్‌మిషన్, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్‌లను మూడు కార్పొరేషన్లుగా చేసింది చంద్రబాబు ప్రభుత్వం. ఈ ప్రక్రియ 1997 నుంచి 2000 దాకా కొనసాగింది. విద్యుత్ రంగాన్ని ప్రయివేటుపరం చేయడాన్ని ఆనాడు వామపక్షాలు గట్టిగా వ్యతిరేకించాయి. ప్రైవేటీకరణతో విద్యుత్ వినియోగదారులపై భారీగా భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి. అనుకున్నట్లుగానే 2000లో విద్యుత్ ఛార్జీలు భారీగా పెరిగాయి. దీన్ని కమ్యూనిస్టులు గట్టిగానే వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగారు. ఈ ఉద్యమంలో భాగస్వామిగా మారిన కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలను కొనసాగించింది. అదే క్రమంలో ఆగస్టు 28, 2000న చలో అసెంబ్లీకి రాజకీయ పక్షాలు పిలుపునిచ్చాయి. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలలో అసెంబుల్ అయిన సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు అసెంబ్లీ వైపు ర్యాలీలుగా వస్తున్న క్రమంలో బషీర్‌బాగ్ ఉద్యమ కేంద్రంగా మారింది. అక్కడే కాల్పులకు తెగబడ్డాయి ఆనాటి పోలీసు బలగాలు. ఫలితంగా స్పాట్ ఇద్దరు.. ఆసుపత్రిలో మరికొందరు మరణించారు. ఈ కాల్పుల ఉదంతం చంద్రబాబు రాజకీయ చరిత్రలో మచ్చగా నిలిచింది అని చెప్పక తప్పదు. ఈ క్రమంలోనే ఆనాటి విపక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం దాకా పాదయాత్ర చేశారు. తాము అధికారంలోకి వస్తు రైతులకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని ప్రకటించారు. ఈ ఉచిత హామీ అప్పుడప్పుడే గాడిలో పడుతున్న విద్యుత్ రంగానికి పెనుభారంగా పరిణమిస్తుందని సీఎం చంద్రబాబు సహా అధికారంలో వున్న వారంతా వాదించారు. భారమైన రైతులకోసం భరించాల్సిందేనన్న వైఎస్ఆర్ తాను ముఖ్యమంత్రి కాగానే తొలి ఫైలుగా ఉచిత విద్యుత్ పథకాన్ని ఆమోదించారు. గత 19 ఏళ్ళుగా ఉచిత విద్యుత్ స్కీంకు అలవాటు పడిపోయారు రైతులు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఈ స్కీంని రెండు తెలుగు రాష్ట్రాలు కొనసాగిస్తూనే వున్నాయి. ఇపుడు రేవంత్ రెడ్డి అయినా మరొకరు అయినా ఉచిత విద్యుత్‌లో చిన్న మార్పు కూడా చేయలేని పరిస్థితి. ఆ సంగతి రాజకీయ పార్టీలన్నింటికీ తెలుసు. కానీ అందివచ్చిన అవకాశాన్ని ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు వదులుకోడు. క్లారిటీతో ప్రకటన చేయలేకపోయిన రేవంత్ రెడ్డి.. అధికార బీఆర్ఎస్ నేతలకు చక్కని అంశాన్ని అందించారు. ఇపుడు క్లారిటీ ఇచ్చుకోవాల్సిన అగత్యాన్ని సొంత పార్టీ నేతలకు కల్పించారు. బీఆర్ఎస్ నాయకులు ఉచిత విద్యుత్‌పై రేవంత్ రెడ్డి కామెంట్లను ఇప్పుడే వదులుకోవు. ఇంకా చెప్పాలంటే వచ్చే ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి మాటల వీడియోలు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల స్క్రీన్స్‌పై ప్లే అవుతాయి. దీనిని తప్పించుకునేందుకు రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు మరేదైనా పెద్ద అంశం దొరికితే తప్ప ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల తూటాలు ఇప్పట్లో ఆగవనే చెప్పాలి.


# ఇండియన్ రోడ్స్ పై టెస్లా కార్లు


**ముంబై, జూలై 15 :**



సుదీర్ఘ చర్చల తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా ఇప్పుడు భారతదేశంలో తన కార్లను తయారు చేసేందుకు సిద్ధం అయింది. కథనం ప్రకారం ఎలాన్ మస్క్ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారతదేశంలో తన తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి విక్రయించేందుకు ప్రాథమిక ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించింది. ఏడాదికి ఐదు లక్షల యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యంతో గిగాఫ్యాక్టరీని నిర్మించాలని టెస్లా పరిశీలిస్తుంది. టెస్లా తన ఎలక్ట్రిక్ వాహనాల బలమైన శ్రేణిని భారతదేశంలో పెద్ద ఎత్తున ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. దాని కోసం బలమైన మౌలిక సదుపాయాలను కూడా కలిగి ఉంది. అలాగే కంపెనీ తన ఎలక్ట్రిక్ కారును తక్కువ ధరలోనే భారతదేశంలో లాంచ్ చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు ఈ కారు గురించి ఎలాంటి సమాచారం రాలేదు. టెస్లా భారతదేశానికి రావడంలో విజయవంతమైతే మారుతి, హ్యుందాయ్ తర్వాత భారతదేశంలో మూడో అతిపెద్ద కార్ల తయారీ కంపెనీగా ఆవిర్భవించవచ్చు. ప్రభుత్వం, టెస్లా అధికారులు భారతదేశంలో టెస్లా ప్లాన్ట్స్, గిగాఫ్యాక్టరీకి సరైన స్థలాన్ని కనుగొనడం కోసం చర్చిస్తూనే ఉన్నారు. ఇది కాకుండా టెస్లాకు సాయం చేయడానికి ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ రెండో దశను అమలు చేయడాన్ని ప్రభుత్వం పరిగణించవచ్చు. ఫేమ్ 2 పథకం 2024 మార్చిలో ముగియనున్నందున, ఫేమ్ 3 పథకంతో ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం ఇప్పటికే పరిశ్రమతో చర్చలు జరుపుతోంది. భారతదేశంలో టెస్లా గురించిన వార్తలు మొదటిసారిగా 2021 చివరలో తెరపైకి వచ్చాయి. అప్పటి నుంచి టెస్లా మనదేశంలో వార్తల్లో ఉంటూనే ఉంది.

# క్షీణించిన పారిశుద్ధ్య పరిస్థితులు





**నందికొట్కూరు**

ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా వర్షా బావ పరిస్థితులు నెలకొన్నాయి. వాతావరణం శాఖ ఎల్ నినో కష్టాలు తప్పవని ఇప్పటికే హెచ్చరించింది. సహజంగా వర్షఋతు ప్రారంభంలో విజృంభించే సీజన్లో ప్రమాదకర స్థాయిలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పునరావృతమవుతున్నాయా, అన్న భయాందోళనలు ప్రజలలో నెలకొన్నాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూర్, వడ్డేమాన్,కోళ్ల బావాపురం, దామగట్ల గ్రామాలలో పారిశుద్ధ్య పరిస్థితిలు అధ్వానంగా ఉన్నాయి. కాలువల పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదు. రోడ్లు గుంతల మయం అయ్యాయి. ఈ పరిస్థితులు దోమలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి. అలాగే వాటర్ ట్యాంకుల పరిశుభ్రతను గాలికి వదిలేశారు. అది కూడా శాస్త్రీయ పద్ధతిలో జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పై గ్రామాలలో ట్యాంక్ శుభ్రం చేయకుండానే పిల్లర్స్ పై తేదీ వేసి, సెల్ఫీ దిగి శుభ్రం చేసినామని అధికారులకు చూపించడం జరుగుతున్నది. డెంగీ మలేరియా నివారణకు ఆరోగ్యశాఖతో పాటు మున్సిపల్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు కలిసి పనిచేయాలని ఆయా గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# తెలంగాణ బీజేపీలో రోజురోజుకూ పెరిగిపోతున్న అసంతృప్తుల సంఖ్య

**హైదరాబాద్ జూలై 15**



తెలంగాణ బీజేపీలో పెరిగిపోతున్న అసంతృప్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఒక్కొక్కరుగా ఉద్యమకారులు అసంతృప్తికి గురవుతున్నారు. మొన్న చంద్రశేఖర్.. నిన్న రవీంద్రనాయక్.. నేడు జిట్టా బాలకృష్ణారెడ్డి బీజేపీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కు మేలు చేసేలా బీజేపీ వ్యవహారం ఉందని జిట్టా ఆరోపిస్తున్నారు. బీఆర్ఎస్‌తో స్నేహంపై ప్రజలకు క్లారిటీ ఇవ్వకుంటే బీజేపీ పతనం ఖాయమని జిట్టా చెబుతున్నారు. ఎంపీ సీట్లే బీజేపీకి ముఖ్యమని.. అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ హైకమాండ్ లైట్ తీసుకుంటోందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నప్పటకీ.. ఎందుకు సన్నద్ధం కావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీకి నూతన నాయకత్వం వచ్చినప్పటికీ క్యాడర్‌లో నమ్మకం కుదరటం లేదని తెలుస్తోంది. జిల్లాల్లో బీజేపీ నాయకులు పనిచేసుకొనే వాతావరణం పార్టీలో లేదని అంటున్నారు. తెలంగాణ బీజేపీని వీడే యోచనలో జిట్టాతో పాటు మరికొందరు నేతలు ఉన్నట్టు తెలుస్తోంది.

## బోరునుంచి గ్యాస్ లీక్ చెలరేగిన మంటలు

**రాజోలు**
అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడులోని ఆక్వా చెరువులో వద్ద బోరులోంచి గ్యాస్, అగ్నికీలలుఎగసిపడుతున్నాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఓఎన్జిసి అగ్నిమాపక సిబ్బంది, ప్రభుత్వ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. గ్యాస్, అగ్నికీలలు గంట నుంచి ఉధృతంగా ఎగిసిపడటంతో ఏ విధంగా అదుపులోకి తీసుకురావాలనేది సమాలోచనలు చేస్తున్నారు. చెరువులకు సుమారు 600 మీటర్ల దూరంలో డ్రైవెల్ ఉండటంతో అక్కడ ఉన్న పైప్ లైన్ నుండి లీకేజీ ఏర్పడి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
ఆక్వా చెరువుల వద్ద ఉన్న బోరు లో ఉన్న సబ్ మెర్సిబుల్ పంపును ఆన్ చేయడంతో ఒక్కసారిగా గ్యాస్ ఎగసి పడి మంటలు చెలరేగడంతో భయాందోళనలో గ్రామస్థులు వున్నారు. ఓఎన్జీసీ సిబ్బంది , ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్తితిని నరసాపురం లో ఉన్న డిజాస్టర్ మానజ్మెంట్ టీం కి సమాచారం చేరవేయడంతో వారు ఘటనా స్థలికి చేరుకున్నారు.

## కరెంటు కోతలతో రోడ్డు ఎక్కిన రైతులు

**సూర్యాపేట**
సూర్యాపేట జిల్లా నూతనకల్ మండంల లో గత నాలుగు రోజులుగా విద్యుత్ అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నూతనకల్ సబ్ స్టేషన్ ముందు రైతులు ఆందోళన చేపట్టారు. సబ్ స్టేషన్ లో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహించిన రైతులు నూతనకల్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న ఈ ప్రభుత్వం కనీసం ఎనిమిది గంటలు కూడా విద్యుత్ అందించడం లేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

## వివాదంలో సాయిధరమ్ తేజ్

**శ్రీకాళహస్తి**
సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ వివాదంలో చిక్కుకున్నాడు. శుక్రవారం నాడు అయన శ్రీ కాళహస్తిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి హారతి ఇచ్చారు. అనవాయితీ ప్రకారం పూజారులు తప్ప మరి ఎవ్వరు ఇవ్వకూడదు. సాయి ధరమ్ తేజ్ హారతి ఇవ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలా అనుమతి ఇచ్చారు అంటు ఆలయ అధికారులు పై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పెడన లో ఉద్రిక్త పరిస్థితి
విజయవాడ
కృష్ణా జిల్లా పెడన టౌన్ పంక్షన్ హాల్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. జనసేన నాయకుల ప్రెస్ మీట్ ను అడ్డుకోవడం కోసం భారీగా వాలంటీర్ లు వైసీపీ శ్రేణులు చేరుకున్నారు. శుక్రవారం మంత్రి జోగి రమేష్, జనసేన అధినేత పవన్ పై చేసిన వ్యాఖ్యలకు జనసేన నాయకులు యడ్లపల్లి రామ్ సుధీర్ శనివారం కౌంటర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసారు. పెడన పోలీసులు గొడవలు జరుగతాయానే సమాచారం తో ముందస్తు బందోబస్త్ ఏర్పాటు చేసారు.

## ఎంబిఏ విద్యార్థి ఆత్మహత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**నెల్లూరు**
గుడ్లూరు మండలం చెంచిరెడ్డిపాలెంలో నరాల ఉదయ్ కిరణ్ రెడ్డి అనే ఎంబిఎ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నారని తెలిపారు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్ఐ ప్రసాద్ రెడ్డిలు సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాతశిశు కేంద్రాన్ని తనిఖీ చేసిన మంత్రి

**జగిత్యాల**
వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు శనివారం నాడు జగిత్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. రోగులను కలిసి వైద్యం ఏ విధంగా అందుతుందని ఆరా తీసారు. మాత శిశు కేంద్రంలో సూపరిండెంట్ రాములు లేకపోవడంతో మంతరి అసహనం వ్యక్తం చేసారు. ఆస్పత్రిలో సిబ్బంది సరిగా లేకపోవడంతో డ్యూటీ టైం లో ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు.

## 'బైక్ పై స్టంట్ చేశాను.. పోలీసులు పట్టేసుకున్నారు

**హైదరాబాద్**
ఇటీవల కేబుల్ బ్రిడ్జిపై బైక్తో స్టంట్స్ చేసిన యువకుడిని పోలీసులు పట్టుకుని, కౌన్సెలింగ్ ఇచ్చారు. 'నేను స్టంట్స్ చేయడంతో పోలీసులు బైక్కు చలానా వేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై అలా చేయను. మీరు కూడా ఇలాంటివి చేయకండి' అని అతడు చెప్పిన వీడియోను సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు షేర్ చేశారు. స్టంట్స్ చేస్తే తమ సిసి కెమెరాలు పట్టేస్తాయని, ఇలాంటి చర్యలకు పాల్పడి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని పోలీసులు సూచించారు.?

# పవన్ దూకుడుతో వైసీపీలో టెన్షన్

**ఏలూరు, జూలై 15:**

ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ వైఎస్ఆర్‌సీపీకి జనసేన పార్టీ నిద్ర లేకుండా చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కాపు సామాజికవర్గం పూర్తిగా దూరమైతే.. గెలుపుపై ఆశలు వదులుకోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో ఉన్న వైఎస్ఆర్‌సీపీ పవన్ కల్యాణ్ దూకుడుతో టెన్షన్ పడుతోంది.దీంతో ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అంబటి రాయుడు వంటి వారిని రాజకీయాల్లోకి తీసుకువచ్చి పవన్ కల్యాణ్ కు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా... పెద్దగా వర్కవుట్ అవడం లేదు. అవి ఎంత వరకు ఉపయోగపడినా.. కనీసం కాపు ఓట్లలో చీలిక తీసుకు రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పరంగా వైఎస్ఆర్‌సీపీ కొత్త ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా కాపు ల్లో బాగంగా చెప్పుకునే తూర్పుకాపు, శెట్టిబలిజ వంటి కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కాపు ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు సంబంధించి త్వరలో విధి విధానాలను ఖరారు చేయనున్నారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. కాపుల సంక్షేమానికి ఏర్పాటయిన కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతం ఉప కులాలైన తెలగ, బలిజ, ఒంటరి కులస్తులను చేర్చారు. అయితే వీరితో పాటు తూర్పుకాపు, శెట్టిబలిజ లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు జనాభా దామాషా ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాపు కార్పొరేషన్ పరిధిలో 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకు ప్రభుత్వం వైఎస్సార్ కాపు నేస్తం పథకం కింద ఆర్థిక చేయూతనందిస్తోంది. బలిజలు, ఒంటరి, తెలగ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం ద్వారా వారిని ఆకట్టుకోవాలని నిర్ణయంచారు. నాలుగేళ్లలో కాపుల సంక్షేమానికి రూ. 32 వేల కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. ఉత్తరాంధ్రలో తూర్పుకాపులు, శెట్టి బలిజలతో పాటు రాయలసీమలో బలిజలు వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నారు. ప్రత్యేక కార్పొరేషన్‌తో వీరికి వెసులుబాటు కల్పించాలనేది ప్రభుత్వ భావన. ఇప్పటికే బీసీ ఉపకులాలకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో పాదయాత్ర సందర్భంగా ఆయా వర్గాల నుంచి వచ్చిన విజ్ఞాపనలను తిరగేస్తున్నారు. ఇందులో భాగంగానే కాపు ఉప కులాల కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వమే కొంత కార్పస్‌ఫండ్ కేటాయించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే అంశం పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కొత్త కార్పొరేషన్లతో రాజకీయంగా కాపు ఓట్లలో చీలిక సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం అ అగ్రకులాలకు సైతం కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. బీసీ కులాలకు ఏర్పాటు చేసింది. ఎన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా.. వివిధ పథకాల కింద ఖర్చు పెడుతున్న నిధులను ఈ కార్పొరేషన్ల లెక్కల్లో చూపిస్తున్నారు తప్ప కొత్తగా నిధులు ఇవ్వడం లేదు. చివరికి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఇవ్వాల్సిన నిధులను కూడా.. ఇలా అందరికీ ఇచ్చే పథకాలకిందే చూపిస్తున్నారు. దీంతో.. కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నట్లుగా చూపిస్తున్నారు తప్ప నేరుగా కేటాయించడం లేదు. మామూలుగా ఏదైనా సామాజిక వర్గ కార్పొరేషన్ అంటే.. ప్రత్యేకంగా నిదులు కేటాయించి.. ఆ సామాజిక వర్గ యువత ఉపాధి కోసం ఆర్థిక సాయం చేస్తారు. గత నాలుగేళ్లుగా పథకాలు తప్ప..అలాంటి సాయం ఏదీ చేయడం లేదు. అందుకే ఇలాంటి కార్పొరేషన్ల వల్ల ఉపయోగం ఉండదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# ఆగస్టు 14 కోర్టుకు రావాలంటూ అవినాష్ కు ఆదేశం

**కడప, జూలై 15:**

వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డికి సిబిఐ కోర్టు శుక్రవారం సమన్లు జారీ చేసింది. ఆగస్టు 14న కోర్టుకు హాజరు కావాలని వైకాపా ఎంపి అవినాష్ రెడ్డికి సమన్లు పంపింది. వివేకా హత్య కేసులో అనుబంధ ఛార్జిషీట్ ను సిబిఐ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. అవినాష్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి,ఉదయ్ కుమార్ రెడ్డిపై ఛార్జిషీట్ వేసింది. వివేకా హత్య కేసులో 8వ నిందితుడిగా సిబిఐ అవినాష్ రెడ్డిని చేర్చింది.మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకు చేసిన కుట్రలో నిందితుల పాత్ర స్పష్టంగా ఉందని సీబీఐ దాఖలుచేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నట్లు తెలిసింది. హత్యకు డబ్బు సమకూర్చిందెవరో తేలాల్సి ఉందన్న కేంద్ర దర్యాప్తు సంస్థ.. ఈ కేసులో సీబీఐ కోర్టుకు అనుబంధ అభియోగపత్రం సమర్పించింది. ఇందులో ౦-6గా ఉదయ్‌కుమార్‌రెడ్డి, ౦-7గా వై.ఎస్.భాస్కరరెడ్డి, ౦-8గా వై.ఎస్.అవినాష్‌రెడ్డిలను పేర్కొంది. వివేకా వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన ఎం.వి.కృష్ణారెడ్డి, వివేకా ఇంట్లో వంటమనిషి లక్ష్మి కుమారుడు ఏదుల



ప్రకాష్‌లను ఇదే కేసులో అనుమానితులుగా పేర్కొంది.ఆదేశాల మేరకు సీబీఐ అభియోగపత్రం దాఖలు చేసినా.. ఇంకా దర్యాప్తు కొనసాగించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. వివేకా చనిపోయే ముందు రాసిన లేఖలో నిగూఢ వేలిముద్రలనూ గుర్తించడంలో భాగంగా లేఖను కోర్టు నుంచి సీబీఐ తీసుకుని, దిల్లీ ఎఫ్?ఎస్?ఎల్?కు పంపింది. నిన్‌హైడ్రిన్ పరీక్ష ద్వారా వేలిముద్రలను గుర్తించాలని కోరింది. ఎం.వి.కృష్ణారెడ్డి, వంటమనిషి లక్ష్మి కుమారుడు ప్రకాష్‌లను అనుమానితులుగా పేర్కొంది. వీటన్నింటిపై స్పష్టత నిమిత్తం దర్యాప్తును మరికొంతకాలం కొనసాగించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ ఎలాంటి విజ్ఞప్తిని కోర్టులకు చేయలేదు. గడువు సుప్రీంకోర్టే నిర్ణయించినందున.. అదనపు గడువు కోసం కూడా ఆ కోర్టు దగ్గరే పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుందని న్యాయవర్గాలు చెబుతున్నాయి.అవినాష్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శివశంకర్‌రెడ్డి రాజకీయ విభేదాలతో కక్ష పెంచుకుని వివేకా హత్యకు కుట్ర పన్నడం ప్రారంభించారని సీబీఐ తెలిపింది. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులివెందుల డివిజన్ మినహా మిగిలిన ప్రాంతాల్లో గెలవడం వైసీపీ శ్రేణులకు ఆశ్చర్యం కలిగించిందని పేర్కొంది. గెలుస్తానన్న ధీమాతో వివేకా తన డివిజన్‌ను వదిలి ఇతర డివిజన్లపై దృష్టి సారించారని.. పులివెందుల వ్యవహారాలను అవినాష్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శివశంకర్‌రెడ్డి పర్యవేక్షిస్తూ వివేకా ఓటమికి కారకులయ్యారని తెలిపింది. వెన్నుపోటు గురించి తెలుసుకున్న వివేకా ఆగ్రహం వ్యక్తం చేసి, గంగిరెడ్డిని పలుమార్లు తిట్టారని పేర్కొంది. ఎంపీ టికెట్ దక్కకుండా వివేకా ప్రయత్నించారని అవినాష్ కక్ష పెంచుకున్నారని.. దీంతో నేరచరిత్ర ఉన్న శివశంకర్‌రెడ్డి ద్వారా హత్యకు కుట్రపన్నినట్లు ప్రాసంగిక సాక్ష్యాలు వెల్లడిస్తున్నాయని అభియోగపత్రంలో సీబీఐ తెలిపింది.

# పంచకర్ల బాటలో మరికొంత మంది....

**విశాఖపట్టణం, జూలై 15:**

విశాఖపట్టణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో మరో కీలక నేత జంప్ జిలానీల లిస్ట్ లో ఉన్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆయనపై పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నేరుగా నిఘా పెట్టారని అంటున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో అధికార పార్టీ నుంచి ఇతర పార్టీలోకి చేరేవారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే విశాఖ నుంచి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు రాజీనామా చేశారు. ఆయన జనసేనలో చేరబోతున్నారు. మరికొంత మంది అధికార పక్షానికి చెందిన శాసన సభ్యులు భాహాటంగా తమ అసహనం... అసంతృప్తి ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి నేతలు పార్టీలో ఇంకెంత మంది ఉన్నారనే విషయం పై ఇప్పుడు చర్చ మెదలైంది. తాజాగా విశాఖపట్టణం వేదికగా మరో కీలక నేత కూడా పార్టీ నుండి సైడ్ అయిపోయారని అంటున్నారు. ఇప్పటికే ఆ నేత పార్టీ కార్యకలాపాలకు కాస్త దూరంగానే ఉంటున్నారనే టాక్ ఉంది. ముఖ్యమంత్రి, రాష్ట్ర స్థాయి నేతల కీలక సమావేశాలకు కూడా ఆయన హజరు నామ మాత్రంగానే ఉంటోంది. దీంతో పాటు పార్టీ కార్యక్రమాల నిర్వాహణ కు కూడ అంతగా ఇంట్రస్ట్ చూపించటం లేదని చెబుతున్నారు. దీంతో ఆయన పై పార్టీ పరంగా నిఘా పెరిగిందని చెబుతున్నారు. విషయం తెలిసిపోవడంతో ఆయన కూడా పార్టీతో టచ్ మి నాట్ అన్నట్లుగా వ్యవహారి స్తున్నారు. ఆయన విశాఖపట్టణం కేంద్రంగా ఆయనకు ఉన్న పాత పరిచయాలన్నింటిని రీ లోడ్ చేసుకుంటున్నారని అంటున్నారు. ఇప్పుడు ఎన్నికల సీజన్ కావటంతో ఎవరికి వారు వ్యక్తిగత అంచనాలు, సర్వేలు పైనే ఎక్కువ కాన్సన్ ట్రేషన్ చేశారని చెబుతున్నారు. ఇతర పార్టీల తో ఉన్న పాత పరిచయాలు కారణంగా పార్టీ లో ఉన్న ప్రస్తుత పరిస్థితులు నేపధ్యంలో ఆయన గోడ దూకేందుకు రెడీ గా ఉన్నారని అంటున్నారు. ఈ సమాచారం ఆ నోటా ఈ నోటా పార్టీ వర్గాలకు వరకు చేరింది. రెగ్యులర్ గా పార్టీ కేంద్ర కార్యాలయం నాయకులకు ఇచ్చే సమాచారం కూడ ఆయనకు ఇవ్వటం లేదనే టాక్ నడుస్తోంది..ఇప్పటికే ఇలాంటి కొందరు నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో పార్టికి గట్టి ఝలక్ ఇచ్చారు. దీంతో అప్పటి నుండి పార్టీని వీడే అవకాశం ఉన్న నేతల పై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం నజర్ పెట్టింది. అలాంటి వారి జాబితాలో విశాఖపట్టణం కు చెందిన కీలక నేత ఉన్నారని బయటకు వచ్చిందని అంటున్నారు. ఉత్తరాంధ్రలో బలమయిన సామాజిక వర్గ నేత కావటంతో ఆయన జనసేన వైపుకు ఎక్కువగా చూస్తున్నారని అనుమానాలు ఉన్నాయి. దీంతో పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు చర్చకు దారితీస్తోంది.అయితే మరో వైపున పార్టీ లో ఆయన పై కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారనే వాదన కూడ వినిపిస్తోంది. పొమ్మనలేక పొగ పెట్టినట్లుగా వ్యవహారం ఉందని, ఎన్నికల సమయంలో రాజకీయాలు వేరుగా ఉండటం అన్ని పార్టీల్లో కామన్ అంశంగా నే చూడాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఎవరెవరు ఏ పార్టీ వైపు వెళుతున్నారని నిఘా పెడితే, ఆ విషయం తెలిసిన తరువాత సదరు నేతకు మరింత ఇబ్బంది ఉండటం కామన్ విషయంగా చెబుతున్నారు. నాయకులందరికి పాత పరిచయాలు ఉంటాయని అంత మాత్రాన సొంత పార్టీలోనే ఇలాంటి పరిస్థితులు క్రియేట్ చేసి మరి ప్రచారం చేస్తున్నారనే టాక్ కూడ ఉంది.

## పశువైద్య కళాశాలలో అధ్యాపకుల ధర్నా

**రాజేంద్రనగర్**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పశువైద్య కళాశాలలో మూడవరోజు లంచ్ టైంలో అధ్యాపకులు ధర్నా నిర్వహించారు. రాజేంద్రనగర్ పశు వైద్య విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ప్రొఫెసర్లను నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని, కుల వివక్ష పూరిత బదిలీలను రద్దు చేసేంతవరకు నిరసన కొనసాగిస్తామని అధ్యాపకులు తెలపగా ఇప్పటివరకు ఈ ఘటనపై కాలేజీ అసోసియేట్ డిన్ స్పందించలేదు

## మైనారిటీల హక్కులను కాలరాయడానికి యూనిఫాం సివిల్ కోడ్

**మదనపల్లె**
కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మైనారిటీల అభిప్రాయ సేకరణ చేయకుండా మైనార్టీల హక్కులను కాలరాయడానికి యూనిఫాం సివిల్ కోడ్ చట్టాన్ని తీసుకొస్తోందని బిఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతం పేర్కొన్నారు. నేడు మదనపల్లె బిఎస్పి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ వాస్తవానికి యూనిఫాం సివిల్ కోడ్ లో మతానికి సంబంధించి కొన్ని మంచి అంశాలు, కొన్ని ఇబ్బందికర అంశాలు ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో చర్చించి ఏవి అనుకూలమో అవి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశం

**పాలకొల్లు**
పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశం లో నూతన రైతు కమిటీ ఏర్పాటు చేసుకున్నారు ఈ సమావేశంలో పాలకొల్లు నియోజకవర్గం వీరవాసరం మండల కమిటీ అలాగే భీమవరం చెందిన ఒక కమిటీ ఇలా తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఈ కమిటీలు అందరూ కలిసి ఒక సమస్య నిర్ణయానికి వచ్చి ముందుగా ప్రభుత్వానికి ఫీడ్ మరియు ఎక్స్పోర్ట్ దారులకు ఒక మెమొరండాన్ని తయారు చేసుకుని వారు అవకాశం ఇచ్చిన తేదీ గాని మమ్మల్ని ఒక తేదీ చెప్పమన్నా ఆరోజు గాని వీరందరూ చర్చకు రావాలని మా సమస్యలు పరిష్కరించాలనేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు చర్చలకు రాకపోతే క్రాఫ్ హాలిడే మాత్రమే మా సమస్యకు పరిష్కారం అవుతుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఫీడ్ కంపెనీలను హెచ్చరించారు
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి గత ప్రభుత్వాలు గానీ ప్రస్తుత ప్రభుత్వం గానీ ఆక్వా రైతులకు ఏ విధంగా లబ్ధి చేసింది లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆక్వా రంగం ద్వారా అధిక శాతంలో పనులు కడుతుంటే రైతు నష్టపోతుంటే మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు రొయ్యల మార్కెట్ రేట్ లేక ఫీడ్ ధరలు ఖర్చులు పెరిగిపోయింది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు రైతు సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫీడ్ కంపెనీలు స్పందించకపోతే ఉమ్మడి పశ్చిమ, తూర్పు, కృష్ణ గోదావరి జిల్లాల రైతులందరూ ఏకమవుతామని, గోదావరి జిల్లాల రైతులందరూ కలిసి క్రాఫ్ హాలిడే ప్రకటిస్తామని , క్రాఫ్ హాల్ డే తోనే మా సమస్యల పరిష్కారానికి పోరాడు నినాదించు సాధించు అంటూ ముందుకు వెళ్తాం అంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు

## విద్యార్థిపై దాడి

**మదనపల్లె**
వాల్మీకిపురంలో రాత్రి ఓ విద్యార్థిపై జరిగిన హత్యాయత్నం కలకలం రేపింది. తంబళ్లపల్లి మండలం ముద్దలదొడ్డికి చెందిన డిగ్రీ విద్యార్థి రవిని బర్తడేపార్టీ పేరుతో కొంతమంది వాల్మీకిపురం తీసుకెళ్లి రైలు పట్టాలపై హత్యాయత్నానికి ప్రయత్నించారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న రవిని వాల్మీకిపురం పోలీసులు అక్కడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మెరుగైన చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## భక్తిశ్రద్ధలతో ఘటాల ఊరేగింపు



**హైదరాబాద్ జూలై 15**
ఆషాఢమాస అమ్మవారి బోనాల ఉత్సవాలలో భాగంగా జియాగూడ ఇందిరానగర్ లోని చారిత్రక నల్లపోచమ్మ, ముత్యాలమ్మ దేవాలయంలో ఒగ్గు కళాకారులచే మైలపోల్ పూజ, గంగతెప్ప పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఏ రామ్మోహన్ గురుస్వామి నేతృత్వంలో ఘటు పూజ, అనంతరం ఘటాల ఊరేగింపు ప్రక్రియ నిర్వహించారు. పురవీధుల్లో కొనసాగిన అమ్మవారి పటాలకు స్థానిక భక్తులు వాడవాడలా హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు నల్లపోచమ్మ, ముత్యాలన్మ దేవాలయ కమిటీ, ఆదిజాంబవ సంక్షేమ సంఘాల సంయుక్తాధ్వర్యంలో కొనసాగుతున్న ఘటాల ఊరేగింపు కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు రామ్మోహన్ గురుస్వామి, కేశవ్, శేఖర్, సురేష్, అఖిల్, ఒగ్గు కళాకారులు, భక్తులు

# ఉచిత డ్రైవింగ్ లైసెన్స్

**మెదక్, జూలై 15,:**




తెలంగాణలో ఎన్నికలు దగ్గర పడుతున్నాయ్.. ఇంకేముంది పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటినుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయ్.. ఎన్నికలకు ఇంకా చాలా సమయముంది.. కానీ.. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని యువతను ఆకర్షించే పనిలో పడ్డాయట బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు.. ఇప్పటి నుండే నియోజకవర్గ పరిధిలో ఉన్న యువతీ, యువకులకు గాలం వేస్తున్నారు.. ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గ పరిధిలో ఉన్న యువతీ, యువకులు ఎమ్మెల్యే, ఎంపీ కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారట.. ఎందుకో తెలుసా..? ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం.. అవును మీరు విన్నది నిజమే ప్రస్తుతం దుబ్బక నియోజకవర్గ పరిధిలో ఇదే ఇంట్రస్ట్ టాపిక్ అయ్యింది. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ లను ఇప్పిస్తున్నారు అక్కడి ఎమ్మెల్యే రఘునందన్ రావు.. ఎంపీ కొత్త ప్రభకర్ రెడ్డి..మొదట ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రకటించారు. 18 ఏళ్ళు నిండిన టూవీలర్ లైసెన్స్ కోసం తన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని యువతీ, యువకులు పెద్ద ఎత్తున్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ కి తరలివచ్చారు. ఇది గమనించిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా యువతకు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించాలని ఫిక్స్ అయ్యారట.. మెదక్ ఎంపీగా ఉన్న కొత్త ప్రభకర్ రెడ్డిది కూడా ఇదే నియోజకవర్గం కావడం.. దీనికి తోడు వచ్చే ఎన్నికల్లో ఆయన ఇక్కడి నుంచి పోటీలో ఉండాలని అనుకుంటున్న నేపథ్యంలో.. ఎంపీ కొత్త ప్రభకర్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి టూ వీలర్ లైసెన్స్ తో పాటు, ఫోర్ వీలర్ లైసెన్స్, దీనితో పాటు ఒక హెల్మెట్ కూడా ఇస్తాం అని ప్రకటించేశారు..ఇంకేముంది.. దుబ్బాక నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం ఉచిత లైసెన్స్ సందడి కొనసాగుతోంది. ప్రస్తుతం టూ వీలర్ లెర్నింగ్ లైసెన్స్ కు 300 రూపాయలు.. పర్మినెంట్ లైసెన్స్ కి 750 రూపాయలు ప్రభుత్వ ఫీజు ఉంది. అలాగే టూడఫోర్ వీలర్ లెర్నింగ్ లైసెన్స్ కు 450 రూపాయలు. పర్మినెంట్ లైసెన్స్ కి 1400 రూపాయల ఫీజు ఉంది. కాగా వీటికి అయ్యే ఖర్చును మొత్తం ఎమ్మెల్యే, ఎంపీనే చెల్లిస్తున్న నేపథ్యంలో యువత కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి అప్లికేషన్లు ఇస్తున్నారు. ఇప్పటివరకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు కార్యాలయానికి 12 వేల దరఖాస్తులు రాగా, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కార్యాలయానికి 13,411 దరఖాస్తులు వచ్చాయిదుబ్బాక నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఈ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను చూసిపక్క నియోజకవర్గాల ఎమ్మెల్యేలు,ఇతర నేతలు కూడా ఇదే బాటలో వెళ్లాలని ఫిక్స్ అయ్యారట.. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కూడా తన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని యువతీ, యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాను ప్రారంభించారు..అక్కడ కూడా ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు యువత భారీగానే తరలివచ్చారు.. మరోవైపు రెండు రోజుల్లో సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర హ్యాండ్లూమ్ సంస్థ చైర్మన్ కూడా దీని ప్రారంభిస్తానని చెప్పారు. ఇలా పోను, పోను ఈ ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా ఉమ్మడి మెదక్ జిల్లా అంత వ్యాపించే అవకాశం ఉందని రాజకీయ నేతలు పేర్కొంటున్నారు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార, ప్రతిపక్ష నేతలు తమకు అందిస్తున్న ఈ ఆఫర్లు చూసి యువత కూడా మురిసిపోతోంది.. ఇప్పుడే ఇలా ఉందంటే.. భవిష్యత్తులో ఇంకెన్ని ఆఫర్లో అంటూ యువతీయువకులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.

# తణుకు సభ సాక్షిగా 'చింతిస్తున్నా.. క్షమించండి'

**తణుకు జూలై 15**



జనసేన అధినేత పవన్ కల్యాణ్ తణుకు సభ సాక్షిగా 'చింతిస్తున్నా.. క్షమించండి' అని కార్యకర్తలు, అభిమానులు, నేతల ముందే అడిగారు. పవన్ కల్యాణ్ 'వారాహి' విజయ యాత్ర రెండో విడత శుక్రవారం నాడు పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో జరిగింది. ఈ సందర్భంగా సభ ప్రారంభం కాగానే.. జనసేన నేత విడివాడ రామచంద్రరావుకు క్షమాపణలు చెప్పారు. ' క్షమాపణలతో సభ ప్రారంభిద్దాం అనుకుంటున్నాను. ఆ క్షమాపణలు ఎవరికంటే విడివాడ రామచంద్రరావు ఆయన ఎంత బలమైన నాయకుడు అంటే నిన్న వీర మహిళలు, జనసేన కార్యకర్తల సభలో చెబితే నాకు సరిపోలేదు. అందుకే తణుకులో పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పుకుంటున్నాను. మీలాంటి నిలబడే నాయకుడి వెంట గత ఎన్నికల సమయంలో నేను నిలబడలేనందుకు మనస్పూర్తిగా చింతిస్తున్నాను. నేను టికెట్ ఇచ్చిన వ్యక్తి పార్టీ నుంచి వెళ్లిపోయారు. సీటు ఇవ్వని రామచంద్రరావు గారు పార్టీ కోసమే నిలబడ్డారు. ఇలాంటి వ్యక్తికి ధన్యవాదాలు చెబుతూ అందరి ముందు క్షమాపణలు కోరుతున్నాను' అని క్షమాపణలతోనే సభను ప్రారంభించారు పవన్. ఈ సందర్భంగా మరోసారి జగన్ సర్కార్‌పై తీవ్ర దుమారం రేపే వ్యాఖ్యలతో సేనాని విరుచుకుపడ్డారు. 'జగన్ రాజకీయ అవినీతిపై జనసేన పోరాటం చేస్తున్నది. జగన్ లంచగొండితనం మీద పోరాటం చేస్తున్నాను. స్థానిక మంత్రి కారుమూరి రైతులపై ఎలా విరుచుకుపడ్డాడో అందరికి తెలుసు. మద్దతు ధర కోసం పోరాడుతున్న దువ్వకి చెందిన 24 మంది రైతులపై కేసులు పెట్టావు. పోలవరం ఎలాగూ కట్టలేవు.. ఎర్రకాల్వ మరమ్మతుల కోసం రూ. 30 కోట్లు ఖర్చు చెయ్యి చాలు. కేంద్రం ఇచ్చిన రూ. 1100 కోట్ల విపత్తు నిధులను ఇతర పద్దులకు మళ్లించావు. సుప్రీంకోర్టు బయటపెడితేనే ఆ విషయం బయటపడింది. నువ్వు.. ప్రజల డబ్బు దొంగతనం చేస్తున్నావు.. అందుకే జగ్గూ భాయ్ అంటున్నాను. నీకు గళ్ల లుంగీ, పచ్చ చొక్కా వెయ్యాలి జగన్. గతంలో ఉన్న పథకాలకు పేర్లు మార్చి వాటిని అమలుచేస్తున్నావు. ఇంత నాటగాడివి.. ఎందుకు నవరత్నాలు పెట్టావు. ఉద్యోగుల పీఎఫ్ డబ్బులు తీసేసావు. కాగ్ ఆ విషయం అడిగితే.. సాంకేతిక తప్పిందం అన్నాడు. పీఎఫ్ దోచేసి, వారిని నిలువునా మోసం చేసావు. జగన్ అనుచరులు ఆయనను జగ్గూ భాయ్ అంటుంటే బాధపడిపోతున్నారు. నన్ను దత్తపుత్రుడుని, ప్యాకేజీ స్టార్ అని, పవన్ అని జగన్ అంటున్నాడు. అందుకే ఆయన్ను జగ్గూ భాయ్ అంటున్నాను. గిట్టుబాటు ధర రాలేదనే రైతులను ఎర్రిపప్ప అని వైసీపీ నాయకులు అంటున్నారు. మీరు ఏమైనా అనొచ్చు.. మేము అంటే తప్పా..? జగన్ గారు నుంచి జగ్గూ భాయ్ అనే స్థితికి జగన్ వచ్చాడు. ఇంకా నా మీద నోరు జారితే జగ్గూ అంటాను.. ఇంకా నోరు జారితే జగన్‌ను ఏమంటానో నాకు తెలీదు. మొలకలు వచ్చాయన్న రైతులనుఇక్కడ మంత్రి ఎర్రిపప్ప అంటాడు. ఎర్రిపప్ప అంటే అర్థం ఏమిటంటే బుజ్జి కన్నా అంటాడు. జగన్ జే ట్యాక్స్ వేస్తే.. తాడేపల్లిగూడెంలో 'కే' ట్యాక్స్.. తణుకులో ఎర్రిపప్ప ట్యాక్స్ వేస్తున్నారు. తాడేపల్లిలో ఒక బూతుల విశ్వవిద్యాలయం ఉంది. వారు చెప్పినట్లు వైసీపీ నాయకులు మాట్లాడితే, చూస్తూ ఊరుకోను' అని మంత్రిని, ముఖ్యమంత్రిని ఏకవచనంతోనే పవన్ మాట్లాడారు.

# నియోజకవర్గంలో 100 మందికి లక్ష సాయం

**హైదరాబాద్, జూలై 15 :**

బీసీల్లో వెనుకబడిన చేతివృత్తులు, కుల వృత్తుల కుటుంబాలకు ఇవాళ్టి నుంచి రూ. లక్ష సాయం అందించనుంది సర్కార్. తొలి విడతలో భాగంగా లబ్ధిదారులను గుర్తించింది. తెలంగాణలోని బీసీ చేతి, కుల వృత్తుల వారికి రూ.లక్ష ఆర్థికసాయం పథకాన్ని తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తికాగా.... లబ్ధిదారుల ఎంపిక పై కసరత్తు పూర్తి చేసింది. తొలి విడతలో భాగంగా? ఎంపికైన లబ్ధిదారులకు ఇవాళ్టి నుంచి చెక్కులను అందజేయనుంది. ప్రతి నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 35,700 మందికి రూ.లక్ష సాయం అందనుంది.చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇవ్వనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ స్కీమ్ ను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచిర్యాల వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులను కూడా అందజేసిన సంగతి తెలిసిందే. రూ. లక్ష సాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 5,28,862 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వీటిని పరిశీలించిన తర్వాత... తొలి విడతలో భాగంగా ఎవరిని ఎంపిక చేయాలనే దాన్ని నిర్ణయించారు అధికారులు. ఇందులో భాగంగా... ఇవాళ లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తారు.మరికొన్ని విడతల్లో అర్హులైన వారిన ఎంపిక చేస్తారు. జూలై 18 నుంచి మిగిలిన దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కానున్నది. ఇదే విషయంపై ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేసింది. విడతల వారీగా ప్రతి నెల 15వ తేదీన చెక్కులను అందజేస్తామని పేర్కొంది. ప్రతి నెల 5వ తేదీలోపు కలెక్టర్లు లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వానికి పంపిస్తారు. ఇన్‌చార్జి మంత్రులు ధ్రువీకరించిన జాబితాలోని లబ్ధిదారులకు ప్రతి నెలా 15లోగా స్థానిక ఎమ్మెల్యేలు రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తారు. దరఖాస్తు ఫారంను ఏ ఆఫీసులోనూ, ఏ అధికారికి అందజేయాల్సిన అవసరం లేదు. లబ్ధిదారులు నెలరోజుల్లోగా తమకు నచ్చిన, కావాల్సిన పనిముట్లను, సామగ్రిని కొనుకోవాలని?. ఆ నిర్ణయాధికారం పూర్తిగా లబ్ధిదారులదేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. సంకొనుగోలు చేసిన యూనిట్ల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

స్కీమ్ మార్గదర్శకాలు?

- లక్ష రూపాయ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు అర్హులు అవుతారు.
-కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వృత్తుల అభ్యున్నతికి ఆర్థిక సాయం అందిస్తారు.
- ఆయా కులాల పనిముట్ల కొనుగోలు, ఆధునీకరణ లేదా ముడిసరుకు కొనుగోలుకు మాత్రమే ఆర్థిక సాయం అందిస్తారు.
- దరఖాస్తుదారుల వయస్సు జూన్ 2 నాటికి 18 -55 ఏళ్లు ఉండాలి.
- వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదు.
-దరఖాస్తు తేదీ నుంచి గత 5 ఏండ్లలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారా కూడా లబ్ధిపొందినవారు అర్హులు కారు. ఇక 2017-18లో రూ.50 వేల ఆర్థిక సాయం పొందిన వారు ఈ స్కీమ్ కు అనర్హులు అవుతారు.
- జూన్ 20 తేదీ వరకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రేషన్‌కార్డు, కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో కూడిన దరఖాస్తులను స్వీకరించారు.

# ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కు 70 ఏళ్ళు

**విశాఖపట్నం**

విశాఖ పీఎం పాలెం వద్ద ఉన్న డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అంతర్జాతీయ క్రికెట్ మైదానం వద్ద ఆంధ్ర క్రికెట్ అసో సియేషన్ ఏర్పడి నేటితో 70 సంవత్స రాలు పూర్తి చేసుకుంది. ఈ సంద ర్భంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ 1953లో ప్రారంభమైన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ యొక్క అసోసియేషన్ సాధించిన ఘనతలను తెలియజేశారు ఆంధ్ర క్రికెట్ అసోసియే షన్ ఏర్పడిన తర్వాత నలుగురు అంతర్జాతీయ క్రికెటర్లను ఆరుగురు మహిళ అంతర్జాతీయ క్రికెటర్లు తమ అసోసియేషన్ ద్వారా వెలుగులోకి వచ్చిన వారని తెలియజేశారు. అంతేకాకుండా ఈ అసోసియేషన్ బాల బాలికలకు చిన్న వయసు నుండి క్రికెట్లో తర్ఫీదు ఇచ్చి అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేసేందుకు ప్రణాళిక రచించామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, బోర్డ్ సభ్యులు స్థానిక క్రికెటర్లు పాల్గొన్నారు

# దుబ్బాక అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు

## ఎమ్మెల్యే రఘునందన్ రావు

**సిద్ధిపేట జూలై 15**



దుబ్బాక అభివృద్ధి విషయంలో కొందరు నాయకులు అడుగడుగునా ఆటంకాలు కల్పించడం బాధాకరమని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 2016లో సీఎం దుబ్బాకకు వచ్చినప్పుడు ఫైర్ స్టేషన్ కొరకు ఒక ఎకరం భూమి రైతు ఇస్తే ఇంతవరకు ఎలాంటి నిర్మాణం లేదని ఆవేదన చెందారు. సాక్షాత్తు సీఎం చెప్పిన మున్సిపల్ భవనానికి కూడా అతీగతీ లేదంటే అర్థం వీరి కపట ప్రేమ అర్థం చేసుకోవచ్చన్నారు. గజ్వేల్, సిద్ది పేటలో ఆగమేఘాల మీద భవనాలు నిర్మించారని.. దుబ్బాకలో ఎందుకు నిర్మించరని ప్రశ్నించారు. సిద్ది పేటలో విపంచి, గజ్వేల్‌లో మహంతి ఆడిటోరియం ఎట్లా పూర్తి చేశారు?.. దుబ్బాకలో ఎందుకు చేయడం లేదని నిలదీశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు వచ్చి 16 నెలలు గడిచినా ఎలాంటి టౌన్ అభివృద్ధి చేస్తలేరు.. చేయనిస్తలేరని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఐఓసీ భవనాలు పూర్తి అయిన దుబ్బాకలో ఇంకా కాలేదన్నారు. ప్రతి పక్షాలు ఉన్న చోట ఒక న్యాయం పాలక పక్షం ఉన్న చోట ఒక న్యాయం దురదృష్టకరమన్నారు.

# గులాబీ కాదు... కమలమే -క్లారిటీ ఇచ్చిన రాజాసింగ్

**హైదరాబాద్, జూలై 15:**



గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్ఎస్ లోకి చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. మంత్రి హరీశ్ రావుతో ఆయన సమావేశం అయిన అనంతరం ఈ ప్రచారం మొదలైంది. బీజేపీ రాజా సింగ్ ను పార్టీ నుంచి గతంలో సస్పెండ్ చేశారు. తాను పార్టీ మారబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్తున్నారన్న ప్రచారం పూర్తిగా అబ్ధమని, తాను బీజేపీని వదిలి ఏ పార్టీలోకి వెళ్లేది లేదని తేల్చి చెప్పారు.బీజేపీ తనపై విధించిన సస్పెన్షన్ ను ఒకవేళ ఎత్తివేయకపోతే.. రాజకీయ సన్యాసం తీసుకుంటా కానీ.. ఇతర పార్టీల్లోకి చేరే ప్రసక్తే లేదన్నారు. దూల్‌పేటలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రి గురించి మాత్రమే మంత్రి హరీశ్ రావు వద్దకు వెళ్లినట్లు తెలిపారు. దూల్‌పేట పై దృష్టి పెట్టి ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిని 30 లేదా 50 పడకల ఆస్పత్రిగా అభి?ద్ధి చేయాలని కోరడానికి మంత్రి వద్దకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేసిన ఇద్దరు మంత్రులను కోరానని, ప్రస్తుతం మూడో హెల్త్ మినిస్టర్ గా ఉన్న హరీశ్ రావును కూడా కలిసి ఇదే విషయాన్ని మాట్లాడినట్లు తెలిపారు. దూల్‌పేట ఆస్పత్రి విషయంపైనే కలవాలని అపాయింట్‌మెంట్ అడిగితే ఇచ్చారని, ఆస్పత్రి విషయం గురించి అడగడానికి మాత్రమే మంత్రి ఇంటికి వెళ్లినట్లు వెల్లడించారు. దూల్‌పేటలోని చిన్న ఆస్పత్రిని మోడల్ ఆస్పత్రిగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశానన్నారు. దానిపై స్పందించిన హరీశ్ రావు.. అధికారుల బృందాన్ని పంపించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రాజా సింగ్ తెలిపారు. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. అలాగే కాషాయం, బీజేపీ నా నరనరాల్లోనూ ఉందని పేర్కొంటూ ట్విట్టర్ లో ఓ వీడియో పోస్టు చేశారు. అత్యంత వివాదాస్పదమైన ఓ వీడియోను యూట్యూబ్‌లో అప్ లోడ్ చేశారు రాజాసింగ్. దానిపై రాత్రికి రాత్రే తీవ్ర దుమారం రేగడంతో పోలీసులు వెంటనే స్పందించి... యూట్యూబ్ నుంచి ఆ వీడియోను తొలగింప చేశారు. వెంటనే రాజాసింగ్‌ను అరెస్ట్ చేశారు. ఈ వీడియో తీవ్ర వివాదం కావడంతో బీజేపీ పార్టీ వెంటనే స్పందించి పార్టీ నుంచి రాజాసింగ్ ను సస్పెండ్ చేసింది. హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారుఖీ ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనకు అనుమతి ఇవ్వవొద్దని రాజాసింగ్ డిమాండ్ చేశారు.ఆయన గతంలో హిందూ దేవుళ్లను అవమానిస్తూ స్టాండప్ కామెడీ చేశారని.. అందుకే ప్రదర్శనకు అంగీకరించబోమన్నారు. అయితే కేటీఆర్ ప్రత్యేక ఆహ్వానం మీద మునావర్ షో ఇవ్వడానికి వచ్చినందున పోలీసులు కూడా ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుని షోను సక్సెస్ చేశారు. రెండు రోజుల పాటు రాజాసింగ్‌ను అరెస్ట్ చేశారు. అయితే తమ కార్యకర్తలు టిక్కెట్లు కొన్నారని.. మునావర్‌ను కొడతామని.. వేదికను తగులబెడతామని హెచ్చరించారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. మునావర్ షోకు అనుమతి తాను చేయాల్సింది చేస్తానని ఆయన హెచ్చరించారు. ఆ ప్రకారం.. వీడియోను విడుదల చేసినట్లుగా తెలుస్తోంది. ఓ వర్గం మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే అవకాశం ఉండంతో పోలీసులు వేగంగా స్పందించారు. వీడియోను తీసేయించినా ఆ విషయం మాత్రం వైరల్ అయింది. వెంటనే స్పందించిన బీజేపీ.. రాజాసింగ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# పవన్ పై మంత్రి అమర్ సెటైర్లు

విశాఖపట్నం


రెండో దశ వారాహి విజయ యాత్రలో పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు ఏపీలో సంచలనం సృష్టిస్తున్నాయి.యాత్రలో భాగంగా మొదటి బహిరంగ సభ ఏలూరులో వాలంటీర్లను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు.మహిళా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని వ్యాఖ్యలు చేయడం పెను దుమారం రేపింది.రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లపై పవన్ చేసిన వ్యాఖ్యలకు తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.పరిస్థితి ఇలా ఉంటే వాలంటీర్ల పై పవన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి గుడివాడ అమర్నాథ్ ఖండించారు.దమ్ముంటే వచ్చే ఎన్నికలలో జనసేన మేనిఫెస్టోలో వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేస్తామని హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు.ప్రజలకు బహిరంగంగా వాలంటీర్ల రద్దు గురించి చెప్పగలరా అని నిలదీశారు.కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వాలంటీర్లు సేవ చేశారని,పెళ్లిళ్లు చేసుకోవడంలో పవన్ కళ్యాణ్ విప్లవం సృష్టించాడని.ఈ విప్లవాన్ని ప్రజలపై రుద్దుతున్నాడు అంటూ మంత్రి అమర్నాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.


# మూడు రాజధానుల కథ కంచికేనా


**విజయవాడ, జూలై 15:**

ఇక మూడు రాజధానుల ముచ్చట మూలకు చేరినట్లేనా..? ఈ ప్రభుత్వ కాలపరిమితి ముగిసేలోగా జరిగే పనైతే కాదు. రాజధాని కేసును డిసెంబర్ కు వాయిదా వేయడంతో ఈ విషయం రూఢీ అయిపోయింది. రాష్ట్రానికి సంబంధించి చాలా కీలకమైన ఆ పరిణామం అతి మామూలుగా ముగిసింది. సుప్రీంకోర్టులో రోజూ జరిగే వేలాది కేసుల్లో ఒకటిలాగా దాన్ని వాయిదా వేశారు. ఇందులో పార్టీలైన రాష్ట్ర ప్రభుత్వం కానీ.. దాని అపోనెంట్స్ కానీ ఎవరూ కూడా పెద్దగా స్పందించలేదు. ఊహించిందే లే అన్నట్లుగా కథ ముగిసింది. బహుశా రెండు పార్టీలూ కోరుకుంది ఇదే అనుకుంటా..!

2015 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించి నోటిఫై చేసింది. ల్యాండ్ పూలింగ్ విధానంలో భూమిని సేకరించి పనులు మొదలుపెట్టింది. ఈ లోగా ప్రభుత్వం మారిపోయింది. రాజధానిపై కొత్త ప్రభుత్వం తీరూ మారింది. మూడేళ్ల కిందట మూడు రాజధానుల ప్రస్తావనతో అగ్గి రాజేసింది.. జగన్ ప్రభుత్వం. ప్రతిపక్షంలో ఉంటూ రాజధానిగా విజయవాడ ప్రాంతానికి మద్దతిచ్చి.. అంతకు ముందు ఎన్నికల సభల్లో రాజధాని ఎలా ఉండాలో ఎంతుండాలో సెలవిచ్చిన జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చాక మూడురాజధానుల రాగం అందుకున్నారు. 'అధికార వికేంద్రీకరణ' పేరుతో మూడు రాజధానులు చేస్తున్నామని ప్రభుత్వం 2020లో అసెంబ్లీలో ప్రకటించింది. అప్పటికే ఉన్న సీఆర్డీఏ చట్టాన్ని రద్దు చేస్తూ.. అమరావతి, విశాఖ, కర్నూలు కేంద్రాలుగా అభివృద్ధిని వికేంద్రీకరిస్తున్నామని మరో బిల్లును అసెంబ్లీలో ఆమోదించారు. అధికార వికేంద్రీకరణ చట్టంపై తమ మాట నెగ్గడం లేదని అప్పట్లో శాసనమండలిని రద్దు చేస్తూ తీర్మానం కూడా చేశారు. తిరుగులేని మెజార్జీ ఉన్న తమకు జరగంది లేదని.. అనుకుంటే రాజధాని మారిపోవాలన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. కానీ ఇది ఎంత సంక్లిష్టమో తర్వాత తెలిసొచ్చింది. ఈ మధ్య కాలంలో మండలి రద్దు విషయాన్ని పక్కన పెట్టడం.. ఆ రెండు చట్టాలను మళ్లీ వెనక్కు తీసుకోవడం.. మూడు రాజధానులు విషయంలోనూ అనేక పిల్లిమెగ్గలు వేయడం కూడా జరిగాయి. ముందు మూడు రాజధానులు అని.. ఆ తర్వాత విశాఖనే ఏకైక రాజధాని అని చేప్పారు. త్వరలోనే విశాఖకు అని ప్రకటనలు తరచుగా వచ్చేశాయి. సుప్రీం కోర్టులో కేసు ఉండగానే.. నేడో రేపో విశాఖకు అన్నట్లుగా మంత్రుల దగ్గర నుంచి ముఖ్యమంత్రి వరకూ ప్రతి ఒక్కరూ ప్రకటించేవారు. తాజాగా రాజధాని షిఫ్టింగ్ డెడ్ లైన్ సెప్టెంబర్. ఇప్పటికే అనేక సార్లు ఇది వాయిదా పడినందున ఈసారైనా జరుగుతుందో లేదో తెలీదు. ఈ విషయాన్ని పక్కన పెడితే మూడు రాజధానులు అనే ప్రతిపాదన ఎలా డైల్యూట్ అవుతూ వచ్చిందో చూద్దాం.ముందు మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత దానిని క్రమక్రమంగా ప్రభుత్వమే నిర్వీర్యం చేస్తూ వచ్చింది. ఫైనల్ గా విశాఖనే ఫిక్స్ అనే పరిస్థితికి వచ్చారు. ప్రభుత్వం మూడు రాజధానుల నుంచి వెనక్కు మళ్లడం వెనుక అనేక న్యాయపరమైన , చట్టపరమైన చిక్కులున్నట్లు ఈ మూడేళ్లలో ప్రభుత్వ పెద్దలకు బాగానే అర్థం అయింది. ప్రభుత్వం చెబుతున్న తరహాలో న్యాయ రాజధాని అంటే హైకోర్టు బెంచ్ లేదా పూర్తి కోర్టు ఏర్పాటు చేయాలన్నా సుప్రీంకోర్టు అనుమతి ఉండాలి. ఒకసారి రాష్ట్రపతి నోటిఫికేషన్ ఇచ్చాక అది తిరుగులేని శాసనం. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతిలోనే అని నోటిఫై చేశారు. దానిని మార్చడం అంత సులభం కాదు అని కూడా గుర్తించకుండా.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామని.. అదేదో రాష్ట్ర ప్రభుత్వం చేతులో ఉన్నట్లుగా జగన్ ప్రకటన చేశారు. అదెంత క్లిష్టమైన విషయం అంటే.. అమరావతిపై హైకోర్టులో విచారణ సందర్భంగా హైకోర్టును అమరావతిలో ఉంచుతున్నట్లుగా ప్రభుత్వం అఫిడవిట్ లో ప్రస్తావించాల్సి వచ్చింది. ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు బిల్లులు మండలిలో ఆమోదం పొందకపోవడంతో దానికి వాలిడిటీ ఉందో లేదో తెలీక ముందే.. ఈ బిల్లులను వెనక్కు తీసుకున్నారు. ఈలోగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ రెండు బిల్లులను కొట్టేసి.. అమరావతిని అభివృద్ధి చేయాలని స్పష్టంగా చెప్పింది. ప్రభుత్వం కేసను సుప్రీంకోర్టుకు తీసుకెళ్లింది. మొదట్లో రాజధాని విషయంలో పూర్తి నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే అని చెప్పిన కేంద్ర ప్రభుత్వం .. తర్వాత తన వాదన మార్చుకుంది. రాజధాని విషయమై ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 5, 6 ని ప్రస్తావించింది. శివరామకృష్ణన్ కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. . అమరావతి నిర్మాణానికి తాము నిధులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీ.. పార్టీ పరంగా తమ మద్దతు అమరావతికే అని స్పష్టంగా ప్రకటించింది. అసలు పునర్వ్యవస్థీకరణ చట్టంలో మూడు రాజధానులు అనే ప్రస్తావన లేదని.. ఏ కేపిటల్ అనే పదబంధం మాత్రమే ఉన్నందున రాజధాని అంటే కేవలం ఒకటే అవుతుందన్న వాదన కూడా ఉంది.ఇవన్నీ గుర్తించిన తర్వాతే .. ప్రభుత్వం కూడా న్యాయ రాజధాని ఊసెత్తడం మానేసి.. విశాఖనే రాజధాని అని చెప్పడం మొదలుపెట్టింది. ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన మూడు రాజాధానులు అన్నది "మిస్ కమ్యూనికేషన్" అన్నట్లుగా తేల్చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి కూడా విశాఖనే కేపిటల్ అన్నట్లుగా మాట్లాడుతున్నారు కానీ మూడు రాజధానులు అన్న మాటను మచ్చుకైనా తేవడం లేదు. ఇవన్నీ ఇలా ఉన్నా కూడా విశాఖకు షిఫ్ట్ అయిపోయి.. తాము







అనుకున్నది సాధించామని చెప్పడానికి ప్రభుత్వం చాన్నాళ్లుగా ప్రయత్నిస్తోంది. కానీ అది కూడా జరగడం లేదు. విశాఖ ముహూర్తం ఇప్పటికే మూడు సార్లు వాయాదా పడింది. ఇంగ్లీషు సంవత్సరం, తెలుగు సంవత్సరాలు కూడా మారిపోయాయి. తాజా ప్రకటన ప్రకారం సెప్టెంబరుకు షిఫ్టింగు. కానీ రుషికొండలో నిర్మాణాలు పూర్తి కాకుండా అక్కడకు వెళ్లే పరిస్థితి లేదు. మూడు రాజధానులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వస్తున్న అమరావతి రైతులు ఏకైక రాజధానిగా అమరావతిని ప్రకటించాలని లేకపోతే యథాతథ స్థితిని కొనసాగించాలని కోరుతున్నారు. కోర్టు కేసులు.. ఇతర వ్యవహారాలతో మూడేళ్లు కాలహరణం జరగడంతో సుప్రీంకోర్టులో కేసులో జాప్యం జరిగితే.. తర్వాత ప్రభుత్వం మారి తమకు న్యాయం జరుగుతుందన్నది అమరావతి మద్దతుదారుల ఆకాంక్ష. అయితే మొదట్లో ఈ విషయంలో దూకుడుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కూడా తన తీరు మార్చుకుంది. అమరావతి కేసు హైకోర్టు, సుప్రీంకోర్టులో వెకేషన్ బెంచ్ కు వెళ్లినప్పుడు.. ప్రభుత్వం వాదనలు చూస్తే.. అలాగే అనిపించింది. అప్పట్లో ప్రభుత్వ లాయర్లే.. తమకు సమయం కావాలని.. రెండు మూడు నెలలు వాయిదా వేయమని కోరారు. తాజాగా సుప్రీంకోర్టు నిర్ణయంపై వీళ్ల స్పందన చూస్తే.. అంతా కోరుకున్నది ఇదేనా అనిపిస్తోంది. ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి వికేంద్రీకరణ– మూడు రాజధానుల అంశాన్ని రాజకీయ అజెండాగా సెట్ చేసేందుకు సిద్ధమయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఇదే పాయింట్ తో ఎన్నికలకు వెళ్లాలన్నది ఆయన ఎలాగో కాలహరణం జరిగింది కాబట్టి.. ఇంకొన్నాళ్లు గడిపి ఎలక్షన్ అజెండాగా సెట్ చేయనున్నారు. కానీ ఇది వైసీపీకి ఎంతవరకో ఉపయోగపడుతుందో చూడాలి. ఎందుకంటే.. రాజధాని ఇస్తామన్నా విశాఖలో అంత సానుకూలత రాలేదు. మొన్న జరిగిన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోరంగా ఓడించారు. పైగా అక్కడ ప్రజలు రాజధానిని వ్యతిరేకించకపోయినా.. తమకు రాజధాని కావాలనే బలమైన ఆకాంక్షను వ్యక్తపరచడం లేదు. ఇక రాయలసీమలో రాజధాని కావాలన్న ఆకాంక్ష తీవ్రంగా ఉన్నా.. వాళ్లకి ప్రామిస్ చేసిన న్యాయ రాజధాని అంత ఈజీగా వచ్చే పరిస్థితి లేదు. దీనిపై రాయలసీమ ప్రాంత వాసుల్లో అసంతృప్తి ఉంది. ఆచరణ సాధ్యం కానీ.. అంతగా ఉపయోగం లేని హైకోర్టు హామీతో తమను ఏమార్చారని సీమ వాసులు కూడా భావిస్తున్నారు. రాజధాని విషయంలో రాజకీయం చేసింది తప్పు.. న్యాయపరంగా కూడా సరిగ్గా పోరాడలేదని సీమ మేధావులు అంటున్నారు. రాజధాని మార్పు.. మూడు రాజధానుల ఏర్పాటు అనే నిర్ణయం రాజకీయంగా తీసుకోకుండా ఓ కమిటీ వేసి చేసి ఉంటే.. న్యాయస్థానాల్లో మన్నన దక్కేదన్న వాదన ఉంది. ఇక రాజధాని రైతుల భూములను ప్రభుత్వం తీసుకున్నందున వారికి పరిహారం విషయంలో ఉన్న చట్టబద్ధత విషయంలోకానీ.. , శివరామకృష్ణన్ కమిటీ ఈ ప్రాంతాన్ని రాజధానిగా వద్దు అనిచెప్పిన విషయాన్ని బలంగా తీసుకెళ్లే విషయంలో కానీ ప్రభుత్వం విఫలమైందని వారంటున్నారు. అసలు మూడు రాజధానులు అన్న కాన్సెప్టే ఇంత వరకూ ఎక్కడా లేదు. సౌతాఫ్రికాలో ఒక్కచోట పెట్టి వెనక్కు వెళ్లారు. ఇప్పటికే రాజధాని విషయాన్ని గందరగోళం చేసి.. రాష్ట్రానికి రాజధాని ఇదీ అని చెప్పుకునే అవకాశం లేకుండా చేశారని వైసీపీ ప్రభుత్వంపై ఓ అసంతృప్తి ఉంది. అసలు మూడు రాజధానులు అన్న కొత్త.. వింత కాన్సెప్ట్ను ప్రజలు ఏ విధంగా ఆదరిస్తారన్న అనుమానాలూ ఉన్నాయి. ఎందుకంటే.. రాజధాని అనే దానిపై అన్ని ప్రాంత ప్రజలకు భావోద్వేగపూరిత సంబంధాలుంటాయి. దానితో ఆటలంటే అగ్గితో చెలగాటమే మరి. మరి వైసీపీ దీనిని ఎలా డీల్ చేస్తుందో చూడాలి.

# అన్నవరం...మరో వివాదం...

**కాకినాడ, జూలై 15 :**

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం..ఇక్కడ వెలసిన రమసత్యనారాయ స్వామిని దర్శించుకోవడానికి తెలుగు రాష్టాల నుంచి మాత్రమే కాదు.. దేశ విదేశాల నుంచి భక్తులు వస్తారు? అయితే అత్యధిక వివాహాలకు పెట్టింది పేరు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం..పెళ్లిలో సీజన్ వచ్చిందంటే చాలు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి పెళ్లి జంటలు పోటెత్తుతాయి.. అన్నవరం కొండపై కళ్యాణ మండపాలు లేక ఆరు బయట ప్రాంగణంలోనూ వివాహాలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. అలాంటి వివాహాలు తంతు జరిపించి పురోహితుల మధ్య అన్నవరం దేవస్థానంలో కొత్త వివాదం నెలకొంది. స్థానికేతర స్థానిక పురోహితుల మధ్య వార్ నడుస్తుంది. వేలంపాట ద్వారా పురోహితులను వివాహాలు జరిపించేందుకు నిర్ణయం తీసుకున్నారు ఆలయ ఈవో, ధర్మకర్త మండలి.కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రం లో స్థానిక, స్థానికేతర పురోహితుల మధ్య వివాదానికి తెరలేచింది..పురోహితులను కాంట్రాక్ట్ పద్ధతులు తీసుకుని అన్నవరం కొండపై జరిగే వివాహాలకు ఉపనయనాలను జరిపించేందుకు ఆలయ ఈవో నిర్ణయం తీసుకోవడంతో వివాదం రాజుకుంది. ఒక వర్గం పురోహితులు దీనికి మద్దతు తెలుపుతుంటే.. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహితుల సమైక్య దీనికి వ్యతిరేకత తెలుపుతుంది.. సింగిల్ విండో విధానం మాకు వద్దని దీన్ని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఇప్పటికే ఆలయ ఈవోకు వినతి పత్రం సమర్పించారు స్థానికేతర పురోహితులు.ఇదిలా ఉంటే ఈ వివాదాన్ని కొట్టి పరేస్తున్నారు ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ . కొండపై దళారుల బెడద తగించేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో బ్రాహ్మణులను వేలంపాట ద్వారా తీసుకొచ్చి భక్తులకు సింగిల్ విండో ద్వారా మేలు చెయ్యాలనీ కొన్ని నిర్ణయాలు తీసుకున్నట్లు టీవీ9 తో తెలిపారు ఆలయ ఈవో. కొండపై జరిగే మైనర్ వివాహాలతో పాటు వివాహాలు జరిపించుకునే భక్తుల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్న బయట దళారులను ఈ విధానం ద్వారా కట్టడి చేయవచ్చు అన్నారు ఆల ఈవో ఆజాద్. పెళ్లిళ్లకు ఉపనయనాలకు వసూలు చేసిన మొత్తాన్ని వేలంపాట ద్వారా పురోహితులకి పూర్తిగా చెల్లిస్తామని తెలిపారు ఆయన.సాధారణంగా పెళ్ళిలు, ఉపనయనాలకు వసూళ్లు చేసి రుసుము పై పురోహితులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఎంతో చరిత్ర కల్గిన శ్రీ అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం లో ఎప్పుడు లేని విధంగా టెండరు వేసి అందులో ఎక్కువ మొత్తం వేసిన వారికి కాంట్రాక్ట్ అప్పచెప్పలని ధర్మకర్త మండలి నిర్ణయం తీసుకున్నారు. అయితే టెండర్ పేరుతో వివాహానికి 5000 చెప్పిన వసూలు చేస్తున్న ఈ పద్ధతి వల్ల పేదవాళ్లు చాలా ఇబ్బందులు పడతారని.. అసలు పురోహితులను వేలం పాట పద్ధతిలో కొనటం ఏంటని ప్రశ్నిస్తున్నారు ఆంధ్రప్రదేశ్ పురోహిత రాష్ట్ర బ్రాహ్మణ సమైక్య అధికార ప్రతినిధి బ్రహ్మశ్రీ నాగాభట్ల రవి శర్మ. ఎప్పటిలాగే యథావిధిగా అందరి పురోహితులను సమానంగా చూడాలన్నారు పురోహితులను వేలంపాట ద్వారా తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారయాన.అన్నవరంలో స్థానిక పురోహితులు 400 పైగా ఉన్నామని వేలంపాట పద్ధతి ద్వారా వివాహాలకు , ఉపనయనాలకు పురోహితులను తీసుకునే విధానాన్ని స్వాగతిస్తున్నామన్నారు అన్నవరం పురోహితులు, వేలంపాట ద్వారా వివాహాలకు బ్రాహ్మణులను తీసుకోవడం సరైన పద్ధతే అంటున్నారు అన్నవరం దేవస్థానం పురోహితులు. ప్రస్తుతం టెండర్ పద్ధతి ద్వారా పురోహితులను తీసుకునే విధానం ద్వారా కొండపైన దళారులు బెడద తగ్గడమే కాకుండా మొదటి ప్రాధాన్యత స్థానిక పురోహితులకు అవకాశం లభిస్తుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ అన్నవరం కొండపై బయట పురోహితులు ఎక్కువైపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. ఆలయ ఈవో ధర్మకర్త మండలి సింగిల్ విండో విధానం ద్వారా భక్తులకు మేలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకోవడం మంచిదంటున్నారు అన్నవరం స్థానిక పురోహితులు.అన్నవరం కొండపై ఇష్టం వచ్చినట్లు ధరలు నిర్ణయించి పెళ్లిళ్లు జరిపేందుకు టెండర్లు పెట్టడం బ్రాహ్మణులని వారికి వారే నిర్ణయించడం చాలా దారుణమైన చర్య అన్నారు దూసర్లపూడి రమణ రాజు.. బయటనుంచి పురోహితులను తెచ్చుకొని అన్నవరంలో పెళ్లిళ్లు చేసుకునే పేదవారికి అవకాశం కల్పించాలని కోరుతున్నారు భోగి గణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు రమణ



రాజు.అయితే అన్నవరం కొండపై పెళ్లి జరగాలంటే చాలా తంతుతో కూడుకున్న పని డోలు సన్నాయి తో పాటు భోజనాలు, మండపాలు , పెళ్ళికొడుకు పెళ్ళికూతురుకు సంబంధించిన వసతితోపాటు కొన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది పెళ్లిళ్లకు సంబంధించి సరైన ధర నిర్ణయం లేక. మధ్యలో దళారులు రావడం ఒక పెళ్లి జరగాలంటే 10,000 నుంచి 20,000 వసూలు చేయడం.. పరిపాటిగా మారిపోయింది. అంతేకాదు సందిట్లో సడే మిలాగా మైనర్లకు కూడా కొండపైనే వివాహాలు జరగడంతో.. లీగల్గా పలు సందర్భాల్లో ఆలయ అధికారులు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకున్న ఆలయ ఈవో ధర్మకర్త మండల సభ్యులు పురోహితులను వేలంపాట ద్వారా తీసుకుని వచ్చే ఆదాయం మొత్తాన్ని పురోహితులకు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఈ వేలంపాట విషయాన్ని కొందరు వ్యతిరేకిస్తుంటే మరికొందరికి స్వాగతిస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అన్నవరంలో ఆల ఈవో ఆలయ ధర్మకర్త మండలి తీసుకున్న పురోహితుల టెండర్ విధానంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఒకరు ఆలయానికి మంచి జరుగుతుందని చెబుతుంటే.. మరో వర్గం ఇది సరైన పద్ధతి కాదు అందరి పురోహితులని సమానంగా చూడాలని కోరుతున్నారు. చూడాలి దీనికి సంబంధించిన పై అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.
















Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950